# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2   ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433   E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్   బుధవారం 27-3-2024   NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026   సంపుటి :30   సంచిక:186   పేజీలు:6   వెల: రూ.1/-


**చురక**

ఫాసిస్టు మనస్తత్వ
పరిపాలన పరుగులు
దిద్దుతారు గెలిపిస్తే
దానికింకా మెరుగులు.

పైకిచూడ పదుతున్నరు
ప్రజాస్వామ్య జెండా
అణువణువు అణచివేతే
అంతర్గత ఎజెండా



-వేల్పుల నారాయణ

## చేపల వేటకు వెళ్లి యువకుడు మృతి

హైదరాబాద్, మార్చి 26: చేపల వేటకు వెళ్లి అనంత లోకాలకు చేరుకున్న దుర్ఘటన వెలిజర్ల గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం?. సోమవారం మధ్యాహ్నం గ్రామంలోని తాళ్ల చెరువులో చేపల వేటకు వెళ్లాడని స్థానికులు చెప్పున్నారు. రాత్రి ఇంటికి రాకపోవడంతో గమనించిన కుటుంబీకులు అతని ఆచూకీ కోసం గాలించారు. మంగళవారం గ్రామంలోని తాళ్లచెరువులో గాలించగా మృతదేహం ఆచూకీ లభించింది. రమేష్ గా గుర్తించారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

గత కొంతకాలంగా గ్రామంలో ఉన్న తాళ్లచెరువు చాలా లోతట్టుగా ఉంది. గతంలో అనేక మంది మృత్యువాత పడ్డ ఘటనలు చోటుచేసుకున్నా ప్రభుత్వం చెరువు వద్దకు వెళ్లకుండా పటిష్ట చర్యలు చేపట్టలేదు.

# గత ప్రభుత్వ అవినీతిపై బహిరంగ చర్చకు సిద్ధం

### -చర్చించేందుకు సమయం, తేదీ, వేదిక ఎక్కడో చెప్పాలి
### -ఎమ్మెల్యే హరీష్ రావుకు మంత్రి జూపల్లి డిమాండ్




హైదరాబాద్, మార్చి 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: రైతు సమస్యలు, నీటి పారుదల ప్రాజెక్ట్ లు, గత బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతిపై బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ బీఆర్ఎస్నేత, ఎమ్మెల్యే హరీష్ రావుకు ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సవాల్ విసిరారు. గత పదేళ్ల బీఆర్ఎస్పాలనలో రైతులకు, ప్రాజెక్టుల నిర్మాణం తదితర అంశాలపై చర్చించేందుకు సమయం, తేదీ, వేదిక ఎక్కడో చెప్పాలని డిమాండ్ చేశారు. గాంధీ భవన్ లో మంగళవారం ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణ రెడ్డి, వీర్లపల్లి శంకర్, వంశీకృష్ణతో కలిసి మంత్రి జూపల్లి కృష్ణారావు మీడియాతో ప్రతినిధులతో మాట్లాడారు.

పంట నష్ట పరిహారం ఇవ్వకుంటే సచివాలయాన్ని ముట్టడిస్తానన్న హరీష్ రావు వ్యాఖ్యలను మంత్రి జూపల్లి తీవ్రస్థాయిలో ఖండించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ అధికారంలో వర్షాలు, వడగండ్ల వాన వల్ల ఎన్ని పర్యాయాలు పంట నష్టం జరిగితే, మీరు ఎన్ని మార్లు పరిహారం చెల్లించారని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు సమస్యలు పట్టించుకోకుండా కేవలం అక్రమాలు, అవినీతికి పాల్పడ్డారని ఆయన ధ్వజమెత్తారు. కాంగ్రెస్పార్టీ ఏం చేసిందో, మీరు ఏమి చేశారో సిద్ధిపేట వేదికగా బహిరంగ చర్చకు సిద్ధమా..? అంటూ ప్రశ్నించారు.

రాష్ట్రాన్ని పదేళ్లపాటు పందికొక్కుల్లా దోచుకున్నారని, అవి ఒక్కొక్కటిగా బయటపడుతుంటే బెంబేలెత్తి , ప్రజా ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. అసలు సినిమా ముందుందని, అనినీతి అక్రమాలు భయటపడతున్నాయని, మీ తలకాయ ఎక్కడ పెట్టుకుంటారని ప్రశ్నించారు. గత పదేళ్లలో రాష్ట్ర ఖజానాను బీఆర్ఎస్ చేతలు ముట్టడించి దోచుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి, కొత్తగా వచ్చిన మా ప్రభుత్వానికి చిప్ప ఇచ్చారని, అయినా కూడా ఆర్థిక క్రమశిక్షణతో ఒక్కొక్క హామీ అమలు చేస్తూ ముందుకు పోతున్నామన్నారు.

అధికారం పోయి మూడుమాసాలు అయినా ఓపిక లేకుండా ఉందని, అధికార దాహం కనిపిస్తున్నదన్నారు. ఎన్నికల లబ్ధికోసమే హరీశ్రావు అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ప్రాజెక్టుల్లో నీళ్లుంటే ఈ పరిస్థితి వచ్చేదా..? అని ప్రశ్నించారు. కాళేశ్వరం, పాలమూరు ఎత్తిపోతల వల్ల కోట్లాది రూపాయలు దండుకొని నాణ్యత లేకుండా నిర్మించారని, ఇప్పుడు వాటిలో నీళ్లులేక వృధాగా ఉన్నాయన్నిరు. అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందనని స్పష్టం చేశారు.

పంట నష్టంపై సీయం రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి, పంట నష్టంపై సమగ్ర నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించారని గుర్తు చేశారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి.. చిప్ప చేతికి ఇచ్చి వెళ్ళిపోయారని, అయినా సీయం రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. పార్లమెంట్ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ కు ప్రజలు బుద్ధి చెప్పుతారని అన్నారు. ఉమ్మడి పాలమూర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం మాదే అని ధీమా వ్యక్తం చేశారు.

రాష్ట్ర ఆర్థిక మంత్రిగా, నీటిపారుదల శాఖ మంత్రిగా పనిచేసిన హరీశ్రావు పెద్ద ఆర్థిక నేరగాడని షాద్నగర్ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ఆరోపించారు. రాష్ట్రంలో ప్రాజెక్టుల నిర్మాణంలో నాణ్యత లేకుండా ఉన్నాయని, పాలమూరు ప్రాజెక్టు అని చెప్పి డబ్బులు దోచుకున్నారంటూ ధ్వజమెత్తారు. తట్టెడు మట్టి కూడా పోయలేదన్నారు. అయిదు లిఫ్టులు, 6 రిజర్వాయర్లు అని ప్రకటించారని, ఎక్కడ ఉన్నాయని ఆయన నిలదీశారు. హరీశ్రావు ఎందుకు సచివాలయాన్ని ముట్టడిస్తారంటూ శంకర్ ప్రశ్నించారు. మిర్చీ రైతులకు ఏడీలు వేసినందుకా, నేరెళ్లలో రైతులను చంపినందుకా, దక్షిణ తెలంగాణాను నష్టం చేసినందుకా, పాలమూరు పేరుతో పార్టీ ఎమ్మెల్యేలు ధనవంతులయ్యారని దుయ్యబట్టారు.

సీఎం రేవంత్రెడ్డి సబ్బండ వర్గాల అభ్యున్నతి కోసం పనిచేస్తున్నారన్నారు. మీ మరదలు కవితమ్మ జైలుకు వెళ్లిందని త్వరలోనే మీ ఇళ్లను పోలీసులు ముట్టడిస్తారు రెడిగా ఉండాలని హెచ్చరించారు. మీది దుర్మార్గుల కుటుంబం అంటూ తీవ్రస్థాయిలో విరుచుకపడ్డారు. నివేదిక రాగానే రైతులకు ఎకరానికి రూ. 10 వేల నష్ట పరిహానం చెల్లిస్తామని, వచ్చే వాన కాలం సీజన్ నుంచి పంటల బీమా పథకాన్ని అమలు చేస్తామని పేర్కొన్నారు. అన్నదాతల కష్టాలు, కడగండ్లు గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాపమేనని, బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక తెలంగాణ రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలు ఆగలేదని, గత పదేండ్లలో 6, 651 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# రైతన్నలకు కేసీఆర్ భరోసా! పల్లె పల్లెకు వెళ్లనున్న గులాబీ బాస్



నల్గొండ, మార్చి 26:ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జరిగిన పంట నష్టం వివరాలను స్వయంగా తెలుసుకునేందుకు మాజీ సీఎం, గులాబీ బాస్ కేసీఆర్ రంగంలోకి దిగుతున్నారు. జిల్లాకు చెందిన మాజీ మంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి వారం రోజులుగా ఎండిన పంటపొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అందుకు సంబంధించిన నివేదికను అధినేతకు అంద జేయడంతో పాటు.. స్వయంగా క్షేత్ర స్థాయిలో పర్యటించి రైతులకు భరోసా కల్పించాలని అభ్యర్థించారు. అందుకు అనుగుణంగా స్పందించిన కేసీఆర్ తనను కలిసిన కంచర్ల బ్రదర్స్తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

నల్లగొండ మండలం ముషం పల్లితో పాటు ఆలేరు నియోజకవర్గ పరిధిలో పర్యటించాలని కేసీఆర్ నిర్ణయించారు. పది సంవత్సరాలుగా ఎండిపోని పంట పొలాలు ఈ సారి ఎందుకు ఎండి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాస్తవ పరిస్థితిని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి వివరిస్తుంటే తట్టుకోలేక పోయిన కేసీఆర్ తక్షణమే తానే క్షేత్ర స్థాయిలో పర్యటిస్తానని, ఎండిన పొలాలను పరిశీలిస్తానని మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డితో మాట్లాడి రూట్ మ్యాప్ తయారు చేయాలని చెప్పినట్టు తెలుస్తోంది. అత్యధికంగా బోర్లు వేసి నష్టపోయిన నల్లగొండ మండలం ముషంపల్లి గ్రామం నుంచే ఈ పరిశీలన మొదలుపెట్టేలా బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమాన్ని రూపొందిస్తోంది.

ఇక.. నల్గొండ జిల్లా తర్వాత వరంగల్ ,మెదక్, రంగారెడ్డి జిల్లాలోనూ కేసీఆర్ పర్యటించనున్నారు. క్షేత్ర స్థాయిలో రైతుల కష్టాలను చూసి, వారిలో ధైర్యాన్ని నింపనున్నారు.

**నేటి కందం- నేటకీ అందం**

మస్తుగ-ఎల్లప్పుడు-శ్రీ
రస్తుగ లోకమ్మునెల్ల లాలించిటచే
విస్తరణకు నోచుకొనగ-
ప్రస్తుతి చేసెద ప్రపంచ రంగస్థలమున్

(మార్చి 27 ప్రపంచ రంగస్థల దినోత్సవం)



-రాధశ్రీ
సెల్:9494481210

# బీజేపీ ఆరో జాబితా విడుదల

న్యూఢిల్లీ, మార్చి 26:రానున్న లోక్సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులతో కూడిన ఆరో జాబితాను బీజేపీ మంగళవారం విడుదల చేసింది. ఈ జాబితాలో రాజస్థాన్, మణిపూర్ రాష్ట్రాలకు చెందిన ముగ్గురు అభ్యర్థులకు చోటు కల్పించింది. రాజస్థాన్లోని దౌసా నియోజకవర్గం నుంచి కన్హయ్య లాల్ మీనా, కరౌలీ-ధోల్పూర్ నుంచి ఇందూ దేవి జాటవ్లను బరిలో నిలిపింది.

ఇక రాజస్థాన్లో 25 లోక్సభ స్థానాలుండగా ఏప్రిల్ 19న తొలి దశలో 12 స్థానాలకు పోలింగ్ జరుగుతుంది. మిగిలిన 13 స్థానాల్లో ఏప్రిల్ 26న రెండో దశలో పోలింగ్ జరుగుతుంది. ఇన్నర్ మణిపూర్ లోక్సభ స్థానం నుంచి బసంత కుమార్ సింగ్ పేరును బీజేపీ ఈ జాబితాలో ప్రకటించింది. మణిపూర్లో ఏప్రిల్ 19, 26 తేదీల్లో రెండు దశల్లో పోలింగ్ జరగనుంది.

మరోవైపు కాంగ్రెస్ రాజస్థాన్, తమిళనాడు నుంచి పోటీ చేసే ఐదుగురు అభ్యర్థులతో సోమవారం ఆరో జాబితాను విడుదల చేసింది. దీంతో కాంగ్రెస్ ఇప్పటివరకూ 190 నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించగా, బీజేపీ ఇప్పటివరకూ 405 లోక్సభ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులను వెల్లడించింది. కాగా 543 లోక్సభ నియోజకవర్గాలకు ఏప్రిల్ 19 నుంచి ఏడు దశల్లో పోలింగ్ జరగనుంది. దేశవ్యాప్తంగా దాదాపు 97 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటిస్తారు.

# పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీజేపీలోకి రేవంత్ జంప్ : కేటీఆర్

హైదరాబాద్, మార్చి 26: పార్లమెంట్ ఎన్నికల తర్వాత రేవంత్ రెడ్డి తన ముఠాతో బీజేపీలోకి జంప్ అవుతారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ దేశంలో కాంగ్రెస్ 40 సీట్లు కూడా దాటే పరిస్థితి లేదు. ఇక ఆ తర్వాత వెంటనే జంప్ అయ్యే వ్యక్తి ఈ దేశంలో ఎవరైనా ఉన్నారంటే.. ఇదే రేవంత్ రెడ్డి.. ఇది రాసిపెట్టుకోండి అని కేటీఆర్ సూచించారు. తెలంగాణ భవన్లో ఏర్పాటు చేసిన సికింద్రాబాద్ పార్లమెంట్ సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు.

తాను మాట్లాడే ప్రతి మాటకు రేవంత్ రెడ్డి స్పందిస్తాడు. కానీ బీజేపీలోకి పోతవు అని ఆరోపణ చేస్తే ఒక్క మాట అంటలేడు. జీవితాంతం కాంగ్రెస్లోనే ఉంటానని ఇప్పటి వరకు రేవంత్ రెడ్డి చెప్పలేదు. రైతుబంధు, కరెంట్ ఇవ్వడానికి చేతకాదు. ఆడపిల్లల పెళ్లిళ్లకు తులం బంగారం ఇస్తామని ఇవ్వడం లేదు. ఇవన్నీ పక్కన పెట్టి ఫోన్ ట్యాపింగ్ అవుతుంది అని లీక్లు ఇస్తున్నాడు. ఏమన్న తప్పు జరిగితే విచారణ చేయ్.. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకో.. ఇక్కడ భయపడేటోళ్లు ఎవరూ లేరు. 100 రోజుల్లో ఏ ఒక్క పని చేయలేదు. రైతులు చస్తుంటే, పొలాలు ఎండుతుంటే చర్యలు లేవు. పార్లమెంట్ ఎన్నికలకు పైసలు కావాలని రైస్ మిల్లర్లను, బిల్డర్లతో సహా అందర్నీ బెదిరిస్తున్నారు. ఇదంతా బయటకు రాకుండా ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని లేవనెత్తిండు అని కేటీఆర్ ధ్వజమెత్తారు.

రేవంత్ రెడ్డి నువ్వే మున్సిపల్ మంత్రివి. మొన్నటి డిసెంబర్ దాకా నేను మున్సిపల్ మంత్రిని. డిపార్ట్మెంట్లో ఏం జరుగుతుందో నాకు తెలుసు. గత మూడు నెలలుగా హైదరాబాద్లో బిల్డింగ్ పర్మిషన్లు ఎందుకు ఇస్తలేవు. పైసలు కడితేనే పర్మిషన్లు వస్తాయని బిల్డర్లను బెదిరిస్తున్న మాట వాస్తవం కాదా..? ఢిల్లీకి రూ. 2500 కోట్లు జమ చేసి కట్టిన మాట వాస్తవం కాదా..? ఇది దోపిడీ సొమ్ము కాదా..? ఇవాళ ఈ తప్పు ఆ తప్పు జరిగిందని, కేసీఆర్ను తిట్టుడు తప్ప ఇంకో పని చేయడం లేదు అని కేటీఆర్ ధ్వజమెత్తారు.

కాంగ్రెసోళ్లు నమ్ముకున్నది పచ్చి అబద్దాలను..

బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు హైదరాబాద్లో పదకొండున్నర లక్షల కుటుంబాలకు 20 వేల లీటర్ల వరకు ఉచితంగా నీళ్లను సరఫరా చేశాం. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మొన్న 8 లక్షల కుటుంబాలకు కొత్తగా వేల రూపాయాల బిల్లులు పంపిస్తున్నారు. దాని మీద కొట్లాడాల్సిన బాధ్యత మనపై ఉంది. 200 యూనిట్ల వరకు ఫ్రీ కరెంట్ అన్నారు. కిరాయి ఉన్నోళ్లకు వర్తించదని చెప్పి.. కేవలం ఓనర్లకు మాత్రమే వర్తిస్తున్నారు. ఎన్నికలకు ముందు అన్ని అందరికీ వర్తిస్తాయని చెప్పి.. ఇప్పుడేమో అన్ని కటింగ్లు చేస్తున్నారు. ఈ విషయాలన్నీ ప్రజలకు తెలియజేయాలి. కాంగ్రెసోళ్లు నమ్ముకున్నది పచ్చి అబద్దాల ప్రచారాలను, యూట్యూబ్ చానెళ్లను అడ్డం పెట్టుకుని దిమాక్ ఖరాబ్ చేస్తున్నారు అని కేటీఆర్ మండిపడ్డారు.

# తెలంగాణలో దంచికొడుతున్న ఎండలు

### -రాబోయే ఐదురోజుల్లో మరింత ఎండల తీవ్రత
### వాతావరణ శాఖ హెచ్చరిక

హైదరాబాద్ మార్చి 26 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);తెలంగాణలో ఎండలు దంచికొడుతున్నాయి. రాబోయే ఐదురోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరుగుతుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ క్రమంలో ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల వరకు పెరిగే ఛాన్స్ ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. 27 నుంచి 30 వరకు ఆదిలాబాద్, కుమ్రంభీం, నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, మహబూబ్నగర్, నల్గొండ, నారాయణపేట, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ను జారీ చేసింది.రాగల ఐదురోజుల పాటు రానున్న ఐదు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీలు పెరిగే అవకాశం వాతావరణ శాఖ అంచనా వేసింది. హైదరాబాద్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల వరకు నమోదయ్యే ఛాన్స్ ఉందని పేర్కొంది. ఇప్పటికే పలు జిల్లాల్లో 42 డిగ్రీలను దాటాయి. రాత్రి పూట 26 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

# తెలంగాణ అభివృద్ధికి మోదీ ఎలాంటి కృషి చేయలేదు:సిఎం రేవంత్రెడ్డి

హైదరాబాద్ మార్చ్ 26 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: పదేళ్లు ప్రధానిగా ఉన్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశానికి ఏం చేశారని ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణ అభివృద్ధికి మోదీ ఎలాంటి కృషి చేయలేదని అన్నారు. బుల్లెట్ ట్రైన్ను గుజరాత్కు తీసుకెళ్లిన మోదీ, వికారాబాద్కు ఎంఎంటీఎస్ రైలును కూడా తీసుకురాలేదని మండిపడ్డారు. గుజరాత్లో సబర్మతి రివర్ ఫ్రంట్ను అభివృద్ధి చేసుకున్న మోదీ, మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధికి ఎందుకు నిధులు ఇవ్వలేదని ప్రశ్నించారు. రీజనల్ రింగ్ రోడ్డు రాకుండా కేంద్ర ప్రభుత్వం ఎందుకు మోకాలడ్డుతోంది.. అని నిలదీశారు. ఏం చూసి మూడోసారి మోదీకి ఓటు వేయాలని ప్రశ్నించారు.మంగళవారం నాడు చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి పార్టీ కేడర్కు లోక్సభ ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్తోనే సామాజిక న్యాయం జరుగుతుందని చెప్పారు. తెలంగాణలో 17 పార్లమెంట్ స్థానాల్లో 14 ఎంపీ స్థానాలు గెలవాలనే పట్టుదలతో ఉన్నామని చెప్పారు. క్షేత్ర స్థాయిలో అందరి అభిప్రాయాలు, సర్వేల ఆధారంగానే పార్టీ అధిష్ఠానం అభ్యర్థులను ఎంపిక చేస్తోందని తెలిపారు. చేవెళ్ల, సికింద్రాబాద్, మల్కాజిగిరి నియోజక వర్గాలకు ఒకదానికొకటి సంబంధం ఉందన్నారు. అన్ని రకాలుగా ఆలోచించే చేవెళ్లలో రంజిత్ రెడ్డి, మల్కాజిగిరి సునీతా మహేందర్ రెడ్డి, సికింద్రాబాద్లో దానం నాగేందర్ని పార్టీ అభ్యర్థులుగా ప్రకటించిందని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు కాంగ్రెస్ వంద రోజుల పరిపాలనకు రెఫరెండమని చెప్పారు. తెలంగాణలో 14 పార్లమెంట్ స్థానాలు గెలిచి ఏఐసీసీ అగ్రనేత సోనియగాంధీకి కృతజ్ఞత చెబుదామని అన్నారు. గత కేసీఆర్ పాలనలో ప్రాణహిత చేవెళ్ల పూర్తి చేయలేదన్నారు. వికారాబాద్ వరకు ఎంఎంటీఎస్ రైలును తీసుకురాలేదని చెప్పారు. తెలంగాణను అభివృద్ధి చేసుకునేందుకు ఇది చక్కని అవకాశమని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకుంటేనే మన ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. కార్యకర్తలకు అండగా నిలబడేందుకు, దేశాన్ని కాపాడుకునేందుకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ వేల కిలోమీటర్లు నడిచారని చెప్పారు. పార్టీకి అండగా నిలబడి సోనియ గాంధీ నాయకత్వానికి బలపరచాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి తుక్కుగూడ రాజీవ్ గాంధీ ప్రాంగణంలో ఆరు గ్యారంటీలను ప్రకటించుకున్నామని తెలిపారు. మళ్లీ అక్కడే ఏప్రిల్ 6 లేదా 7వ తేదీల్లో జాతీయస్థాయి గ్యారెంటీలను ప్రకటించుకోబోతున్నామని అన్నారు. రంగారెడ్డి జిల్లా నుంచే దేశ రాజకీయాలకు శంఖారావం పూరించబోతున్నామన్నారు. ఈ జనజాతర సభకు ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లిఖార్జున ఖర్గే హాజరవుతారని సీఎం రేవంత్రెడ్డి తెలిపారు.

# కవిత కు 14 రోజుల జ్యూడీషియల్ కస్టడీ...

### -తీహార్ జైలుకు తరలించి.. అక్కడే విచారణ జరిపే అవకాశం ?

న్యూ ఢిల్లీ మార్చ్ 26 (ఎక్స్ ప్రెస్ న్యూ స్)ల;ఢిల్లీ లిక్కర్ స్కామ్లో అరెస్టైన ఎమ్మెల్సీ కవిత విషయంలో రౌస్ అవెన్యూ కోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. ఈడీ కస్టడీ ముగిసిన నేపథ్యంలో ఆమెకు 14 రోజుల జ్యూడీషియల్ కస్టడీ విధించింది ధర్మాసనం.

ఈ మేరకు తీర్పు వెలువరించింది కోర్టు. ఏప్రిల్ 9వ తేదీ వరకు కవిత జ్యూడీషియల్ కస్టడీలో ఉండనున్నారు. ఏప్రిల్ 9న ఉదయం 11 గంటలకు కోర్టులో హాజరుపరచాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. అయితే, కవితను కస్టడీకి ఇవ్వడం ఇది మూడోసారి. మొదట 7 రోజులు, ఆ తరువాత 3 రోజులు, ఇప్పుడు 14 రోజులు జ్యూడీషియల్ కస్టడీకి ఇచ్చింది న్యాయస్థానం. కవితను తీహార్ జైలుకు తరలించి.. అక్కడే విచారణ జరుపుతారని అధికార వర్గాలు చెబుతున్నారు.

### కవిత బెయిల్ పిటీషన్.. ఏప్రిల్ 1వ తేదీన విచారణ

కాగా, ఈ కేసులో కవిత మధ్యంతర బెయిల్ పిటిషన్ వేశారు. తన కుమారుడి పరీక్షల నేపథ్యంలో మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని కవిత కోరారు. అయితే, ఈ పిటిషన్పై సమాధానం ఇచ్చేందుకు సమయం కావాలని కోర్టును ఈడీ కోరింది. దీంతో సీబీఐ ప్రత్యేక కోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. ఈ బెయిల్ పిటిషన్పై ఏప్రిల్ 1వ తేదీన విచారణ జరుపుతామని న్యాయస్థానం తెలిపింది.

### విచారణకు సహకరించడం లేదు..

మంగళవారంతో కవిత ఈడీ కస్టడీ ముగిసింది. దీంతో ఆమెను ఈడీ అధికారులు కోర్టులో హాజరుపరిచారు. జ్యూడీషియల్ కస్టడీకి ఇవ్వాలని కోర్టును ఈడీ అధికారులు కోరారు. మరికొన్ని రోజులు కస్టడీకి ఇవ్వాల్సిందేనని న్యాయస్థానంలో వాదించారు. కవిత విచారణకు సహకరించడం లేదని, మరింత సమాచారం రాబట్టాల్సి ఉందని ఈడీ తరఫు న్యాయవాదులు కోర్టు దృష్టి తీసుకువెళ్లారు. కేజ్రీవాల్, కవితను కలిపి విచారించాల్సిన అవసరం ఉందని, అందుకే మరో వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని ఈడీ కోరింది. ఈ నేపథ్యంలో కోర్టు ఎమ్మెల్సీ కవితకు 14 రోజుల జ్యూడీషియల్ రిమాండ్ విధించింది.

### కడిగిన ముత్యంలా బయటకొస్తా.. కవిత

కోర్టుకు వచ్చే ముందు ఎమ్మెల్సీ కవిత సంచలన కామెంట్స్ చేశారు. ఈ కేసులో తాను కడిగిన ముత్యంలా బయటకు వస్తానని అన్నారు. ఇది మనీలాండరింగ్ కేసు కాదని, పొలిటికల్ లాండరింగ్ కేసు అని విమర్శించారు. తనను తాత్కాలికంగా జైలులో పెట్టొచ్చన్నారు. క్లీన్చిట్తో బయటకు వస్తానని అన్నారు. తాతను ఏ తప్పు చేయలేదని, అప్రూవర్గా మారనని అన్నారు. ఈ కేసులో ఒక నిందితుడు బీజేపీలోకి చేరితే.. 2వ నిందితుడికి బీజేపీ టిక్కెట్ ఇచ్చిందని కవిత వ్యాఖ్యానించారు. మూడో నిందితుడు రూ. 50 కోట్ల ఫండ్స్ బీజేపీకి ఇచ్చారని అన్నారు.

# శ్రీవారిని దర్శించుకున్న విశ్రాంత సీజే ఎన్వీ రమణ



తిరుపతి, మార్చి 26: సుప్రీం కోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణమంగళవారం కుటుంబ సమేతంగా తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు . ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, అధికారులు రమణ కుటుంబ సభ్యులకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. టీడీపీ ఏపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు స్వామివారిని దర్శించుకున్నారు.

తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది . వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో 15 కంపార్టుమెంట్లు నిండిపోగా , టోకెన్లు లేని భక్తులకు 12 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని టీటీడీ అధికారులు వివరించారు. నిన్న స్వామివారిని 78,731 మంది భక్తులు దర్శించుకోగా 25,156 మంది తలనీలాలు సమర్పించు కున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 3.40 కోట్లు వచ్చిందని వివరించారు.

# తాగునీటి సరఫరాపై ఆందోళన వద్దు : సీఎస్ శాంతికుమారి

హైదరాబాద్, మార్చి 26:రాష్ట్రంలోని మూడు ప్రధాన రిజర్వాయర్లలో సరిపడా నీటి లభ్యత ఉందని.. ప్రస్తుత వేసవిలో తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేవని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి స్పష్టం చేశారు. తాగునీటి సరఫరాపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాగునీటి సమస్య తలెత్తకుండా ఇప్పటికే 'సమ్మర్ యాక్షన్ ప్లాన్'ను రూపొందించి జిల్లాలకు నిధులు విడుదల చేయాలని చెప్పారు. రాష్ట్రంలో తాగనీటి సరఫరాకు ఏవిధమైన ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఇప్పటికే బోరు బావుల ఫ్లషింగ్, పైపుల మరమ్మతులు చేపట్టడం పూర్తి చేయడం జరిగిందని చెప్పారు.

నిర్వహణ పరమైన లోపాలను ఎప్పటికప్పుడు వెంటనే సవరించి నీటి సరఫరాకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతీ రోజు గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి సరఫరాపై సంబంధిత క్షేత్ర స్థాయి అధికారులు, నోడల్ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించాలన్నారు. వేసవికాల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మంజూరు చేసిన పనులన్నీ సకాలంలో పూర్తి చేసేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ప్రధానంగా ఆపరేషన్, మెయింటెనెన్స్లపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఇతర రాష్ట్రాలలో ఎదురవుతున్న తాగునీటి సమస్యను మన రాష్ట్రానికి కూడా అన్వయిస్తూ ఆందోళనకరమైన వార్తా కథనాలు వస్తున్నాయన్నారు.

రాష్ట్రంలో ఈ సారి లోటు వర్షపాతం ఉన్నా, ఇక్కడి ప్రధాన జలాశయాలు, ఎస్సారెస్పీ, శ్రీపాద ఎల్లంపల్లి, నాగార్జున సాగర్తో గత సంవత్సరం మాదిరిగానే నీటి మట్టాలున్నందున ఆందోళన అవసరం లేదన్నారు. అయినప్పటికీ ప్రత్యామ్నాయ ఏర్పాట్లను రూపొందించుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. కొన్ని మున్సిపాలిటీలు, గ్రామాల్లో నిర్వహణ పరంగా లోపాలొచ్చాయని.. లోపాలను పరిష్కరించినట్లు చెప్పారు. నీటి సమస్యలపై వివిధ మాధ్యమాల ద్వారా వచ్చే వార్తలపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఏప్రిల్ రెండవ వారం అనంతరం రిజర్వాయర్ల నుండి ఎమర్జెన్సీ పంపింగ్ ను చేపడతామని సి.ఎస్ తెలియ చేసారు. హైదరాబాద్ మహా నగరంలో కూడా సరిపడా నీటి సరఫరా చేస్తున్నామని, అయితే, కమర్షియల్ అవసరాల నిమిత్తం డిమాండ్ ఎక్కువగా ఉందని జలమండలి అధికారులు తెలిపారు.

# నాటకరంగ కళ అంతరించే అంచున ఉందా !

**(27 మార్చి "ప్రపంచ రంగస్థల దినోత్సవం" సందర్భంగా)**

1961లో అంతర్జాతీయ రంగస్థల సంస్థ (ఇంటర్నేషనల్ థియేటర్ ఇనిస్టిట్యూట్, ఐటిఐ) చొరవతో రంగస్థల ప్రాధాన్యం, సమాజ పరివర్తనంలో ప్రత్యక్ష పాత్రను నిర్వహించడం లాంటి లక్ష్యాలతో ప్రతి ఏట 27 మార్చిన ప్రపంచ దేశాలు "ప్రపంచ రంగస్థల దినోత్సవం (వరల్డ్ థియేటర్ డే)"ను పాటించుట ఆనవాయితీగా మారింది. ప్రపంచ రంగస్థల దినం – 2024 నినాదంగా థియేటర్ అండ్ ఏ కల్చర్ ఆఫ్ పీస్" అనే అంశాన్ని ఎంపిక చేశారు. నాటకం సార్వజనీయం, సర్వకాలీనం. ప్రాచీన కళల్లో బహుళ ప్రజాధరణ పొందిన నాటకం ప్రముఖమైంది. మన ముందున్న అనేక కళల్లో జీవితాన్ని వాస్తవంగా చూడడానికి, మానసికోల్లాసానికి రంగస్థలం ఉపయుక్తం అవుతున్నది. నేటి డిజిటల్ యుగపు వినోద విజ్ఞాన మాధ్యమాలుగా సినిమాలు, స్మార్ట్‌ఫోన్లు, గూగుల్ మాధ్యమాలు, అంతర్జాల తెరలు, ఓటిటి వేదికల వరదల్లో నాటకరంగం కొట్టుమిట్టాడుతున్నది. రంగస్థల నాటకాలు, వీధి నాట్యాలు, నాటికలు అనాదిగా మానవాళికి వినోద విజ్ఞాన వితరణ కేంద్రాలుగా సేవలు అందించడం మన గత అనుభవంగా మది పొరల్లో మధుర జ్ఞాపకాలుగా మిగిలిపోయాయి. నేడు రంగస్థలం ఆదరణ కరువై అనాథగా మారి అంతరించే దుస్థితికి చేరడం బహు విచారకరం.

### డిజిటల్ వేదికలతో వెలవెలబోతున్న రంగస్థలం:

రంగస్థల పోషకులుగా నటులు, దర్శకులు, రచయితలు,సంగీతకారులు, గాయకులు, డిజైనర్లు, శబ్ద నిర్మాతలు, లైటింగ్/స్టేజ్/వేషధారణ నిపుణులు నాటకాన్ని సజీవ రూపంగా మార్చడానికి కృషి చేయడం మనకు తెలుసు. ఒక నాడు ఓ మహా ఉద్యమ చరిత్రగా వెలిగిన రంగస్థలం ఆధునిక పోకడలతో రోజు రోజుకు నిరాదరణకు గురవుతున్నది. గొప్ప చరిత్ర కలిగిన రంగస్థల దినం సందర్భంగా థియేటర్ నిపుణులు, ఔత్సాహికులు, నిర్వహణ సంస్థలు నేడు కూడా అవిరళ కృషి చేస్తున్నారు. భాష, సంస్కృతి, సరిహద్దులకు అతీతంగా రంగస్థల రూపాలు ప్రజలకు విశేష వినోదాన్ని, స్ఫూర్తిని కలిగిస్తూనే ఉన్నాయి. ప్రపంచ రంగస్థల దినం వేదికగా నాటకాలు, నాటికలు, వీధి లఘు నాటికలు ప్రదర్శించడంతో పాటు నాటక రంగ సుప్రసిద్ధ నిపుణుల సేవలకు పురస్కారాలు, నాటకాలను చూడడం, ఉచిత ప్రదర్శనలు ఏర్పాటు చేయడం, నటులకు చేయూత ఇవ్వడం, థియేటర్ ఫెస్టివల్స్ నిర్వహించడం, నాటక రంగాన్ని వివిధ మాధ్యమాల ద్వారా ప్రచారం చేయడం లాంటివి నిస్వార్థంగా కొనసాగాలి. రంగస్థల శక్తిని గ్రహించి విద్యాలయాలు, యూనివర్సిటీలు, స్వచ్ఛంధ సంస్థలు, ప్రభుత్వాలు, ప్రైవేట్ రంగాలు, పౌర సమాజం తగు చర్యలను తీసుకొని మసకబారిన నాటకంపై వెలుగులు విరజిమ్మాలి.

### నాటకం ఓ దృశ్య శ్రవణ సజీవ రూపం:

నాటకం ప్రజలను ఏకం చేస్తుంది. రంగస్థలం సమాజాన్ని జాగృత పరుస్తుంది. సమాజ అవలక్షణాలను విమర్శిస్తూనే విరుగుడు మంత్రాన్ని బోధిస్తుంది. నాటకం ఓ వాస్తవ దృశ్య శ్రవణ రూపం. పరస్పర అవగాహన, సాంస్కృతిక వైవిధ్య ప్రాముఖ్యాన్ని కళ్లకు కట్టినట్లు చూపుతుంది నాటకం. రంగస్థలం ఉచిత నడవిజ్ఞాన వితరణ కేంద్రం. ప్రపంచ మానవాళి జీవితాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చిన నాటక రంగ కళ నేడు నిరాదరణ వరదలో కొట్టుకుపోతున్నది. నాటకరంగంలో వెలిగిన ప్రముఖ నటులు వెండితెర స్టార్లుగా వెలుగులు చిమ్ముతున్నారు. నాటకం నుంచే సినిమా పుట్టింది. ఇప్పటికీ రంగస్థల నటులు సినిమా రంగంలో రాణిస్తూనే ఉన్నారు. ఏఎన్ఆర్, ఎన్టీఆర్, నాగయ్య, ఎస్ వి రంగారావు, కోట బ్రదర్స్, జయప్రకాష్ రెడ్డి, యువ సంచలనం విజయ్ దేవరకొండ/నవీన్ పోలిశెట్టి, సందీప్ మాధవ్ లాంటి ఎందరో మన తెలుగు నటులు టాలీవుడ్‌ను ్నం చేసిన విషయం మనకు తెలుసు.

అన్ని వర్గాల ప్రజలను ఏకం చేస్తూ ప్రపంచ శాంతికి ఊతం ఇస్తున్న రంగస్థలం పునర్వైభవం పొందడానికి ప్రతి ఒక్కరు తమ వంతు కృషిని చేయాలి. నాటకాన్ని మన జీవితాల్లో భాగం చేసుకోనడవాలి.



– డా।। బుర్ర మధుసూదన్ రెడ్డి, 99497 00037

# ఎన్నికల తర్వాతా బీజేపీలో చేరే మెదటి వ్యక్తి సీఎం రేవంత్‌రెడ్డినే!

**-దానం నాగేందర్ బీఆర్ఎస్‌ను వదిలిపోవడంతో తమకు ఏం నష్టం**

**-బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు**

హైదరాబాద్ మార్చ్ 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );;: లోక్‌సభ ఎన్నికల తర్వాతా బీజేపీలో చేరే మెదటి వ్యక్తి సీఎం రేవంత్‌రెడ్డి నే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. రేవంత్ జీవితమంతా కాంగ్రెస్‌లోనే ఉంటానని ఏనాడు చెప్పడం లేదన్నారు. మంగళవారం నాడు తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ... రూ. 2500 కోట్లను ఢిల్లీకి రేవంత్‌రెడ్డి పంపించారని ఆరోపించారు. జేబులో కత్తెర పెట్టుకుని తిరుగుతున్న జేబు దొంగ రేవంత్ అని ఎద్దేవా చేశారు. ఫోన్ ట్యాపింగ్ అయితే సీఎం రేవంత్ విచారణ చేయించాలని అన్నారు.

విచారణలో తప్పు జరిగిందని తేలితే నిందితులపై చర్యలు తీసుకోవాలని చెప్పారు. రేవంత్‌కు భయపడే వారు ఎవ్వరూ లేరని అన్నారు. ఆయన తమను ఏం చేయలేరని అన్నారు. రేవంత్ బిల్డర్లను బెదిరిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. మూడు నెలలుగా ఎందుకు బిల్డింగ్‌లకు అనుమతులు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. దొంగ కేసులు పెట్టి బీజేపీ నేతలు తమను బెదిరిస్తున్నారని ధ్వజమెత్తారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు దేశవ్యాప్తంగా 40 ఎంపీ సీట్లు కూడా రావని చెప్పారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి లెక్క మాట్లాడటం లేదని చెప్పారు.

**దానం బీఆర్ఎస్‌ను వదిలిపోవడంతో తమకు ఏం నష్టం**

ఎమ్మెల్యే దానం నాగేందర్ బీఆర్ఎస్‌ను వదిలిపోవడంతో తమకు ఏం నష్టం లేదన్నారు. మూడు, నాలుగు నెలల్లోనే ఖైరతాబాద్‌లో ఉప ఎన్నిక వస్తుందన్నారు. ఆ ఎన్నిక కోసం బీఆర్ఎస్ క్యాడర్ సిద్ధంగా ఉండాలని.. ద్రోహం చేసిన వారికి బుద్ధి చెప్పాలని హెచ్చరించారు. నాగేందర్ అధికారం కోసం ఆశపడి, గెలిపించిన ప్రజలకు ద్రోహం చేసి కాంగ్రెస్‌లోకి వెళ్లారని అన్నారు. ఖైరతాబాద్ ప్రజలు ఉప ఎన్నికలో బీఆర్ఎస్‌ని గెలిపించి, ఆయన నిర్ణయం తప్పని నిరూపిస్తారనే నమ్మకం ఉందని అన్నారు. నాగేందర్ అవకాశవాద రాజకీయాల కోసం కాంగ్రెస్‌లోకి వెళ్లారని మండిపడ్డారు. గతంలో ఆసిఫ్‌నగర్ నుంచి పోటీ చేసి ఓడిపోయిన పరిస్థితి మళ్లీ రిపీట్ అవుతుందన్నారు. రెండు పడవల ప్రయాణం ఎప్పుడు కూడా మంచిది కాదన్నారు. దానం నాగేందర్‌పై ఇచ్చిన ఫిర్యాదుపై అసెంబ్లీ స్పీకర్ వెంటనే నిర్ణయం తీసుకోవాలని కోరారు. నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అవసరం అయితే సుప్రీంకోర్టు దాకా వెళ్లి మరి అనర్హుడిగా ప్రకటించేలా చేస్తామన్నారు. రాజకీయాల్లో హత్యలుండవు, అత్మహత్యలే ఉంటాయని చెప్పారు. అధికారం లో ఉన్నప్పుడు పార్టీలోకి రావటం, ఉండటం మంచి పద్ధతి కాదన్నారు. కష్ట కాలంలో పార్టీలో నిలబడినప్పుడే నిజమైన నాయకులు అవుతారని చెప్పారు. దానం నాగేందర్ పార్టీ మారి తప్పు చేశారని మండిపడ్డారు. ఓటు వేసిన కార్యకర్తలను మోసం చేసి వెన్నుపోటు పొడిచారని కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# కుప్పంలో వైఎస్సార్ కాంగ్రెస్ అభ్యర్థికి డిపాజిట్ కూడా రాదు: చంద్రబాబు జోస్యం

అమరావతి మార్చ్ 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ఏపీ సీఎం జగన్‌పై మాజీ సీఎం చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు చేశారు. కుప్పం నియోజకవర్గంలో సోమవారం మహిళలతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరుగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కుప్పం ప్రజలు తనకు లక్ష ఓట్ల మెజారిటీ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజలను తానెప్పుడూ మెజారిటీ ఇవ్వాలని అగడలేదని.. ప్రజలే భారీ మెజారిటీ ఇవ్వాలని నిర్ణయించుకున్నారన్నారు. కుప్పంలో వైఎస్సార్ కాంగ్రెస్ అభ్యర్థికి డిపాజిట్ కూడా రాదని జోష్యం చెప్పారు. ఏపీలో భారీ మెజారిటీ వచ్చే నియోజకవర్గం కుప్పమేనని.. ఎన్నికల్లో టీడీపీని గెలిపించిన నియోజకవర్గం కుప్పంమన్నారు. సైకిల్‌కు తప్ప వేరే పార్టీకి ఓటేయని నియోజకవర్గం బంగారు కుప్పం అని వ్యాఖ్యానించారు. గతంలో 70వేల మెజారిటీ వచ్చిందని.. ఈ సారి లక్ష్యం లక్ష ఓట్ల మెజారిటీ అని పేర్కొన్నారు. ఇప్పటికీ నియోజకవర్గ ప్రజలు ఏడుసార్లు గెలిపించారని.. ఎంతో రుణపడి ఉన్నానన్నారు. గత 35ఏళ్లలో ఏం చేశానో.. రాబోయే ఐదేళ్లలోనూ అంత చేయి చూపిస్తానన్నారు. మొన్న చాలా మంది కుప్పిగంతులు వేశారని.. చంద్రబాబును ఓడిస్తామన్నారని గుర్తు చేశారు. వై నాట్ కుప్పం.. వైనాట్ 175 అన్నారని.. కుప్పంలో తనను ఓడించడం వైఎస్సార్ కాంగ్రెస్‌తో సాధ్యమవుతుందా.. అని ప్రశ్నించారు.తాను వై నాట్ పులివెందుల నీకెందుకు ఓటు వేయాలని జగన్ బాబాయిపై గొడ్డలి వేటు వేసినందుకా .. రాష్ట్రాన్ని దోచుకున్నందుకా రాష్ట్రాన్ని రావణకాష్టంలా మార్చినందుకా అంటూ ప్రశ్నించారు. కుప్పం నుంచి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుడున్నానన్న బాబు.. ప్రజాగళం ఉధృతంగా మారి.. తీవ్ర వాయుగుండంగా మారి అడ్డొచ్చిన వారిని బంగాళాఖాతంలో కలిపేస్తుందన్నారు. ఏ చెట్టును అడిగినా.. ఏ పుట్టని అడిగినా సైకిల్.. మిత్రపక్షాల మాటే వినపడాలని.. ఫ్యాన్‌ను చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు.

# జర్నలిస్టులకు న్యాయం చేస్తా...

**-హామీ ఇచ్చిన రూరల్ ఏసిపి తిరుపతిరెడ్డి**

**-ఆకుతోట ఆధ్వర్యంలో ఏసీపీని కలిసిన జర్నలిస్టుల బృందం**



ఖమ్మం, మార్చి 23:(నేటినిజం ప్రతినిధి): కారేపల్లి బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాధ్యత రహితంగా వ్యవహరిస్తూ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలకు గైరాజరవుతున్న నేపథ్యంలో పలు పత్రికలలో వార్తలు రావడం జరిగింది. ఇట్టి విషయమై ఈనెల 18న అదే కారేపల్లి పాఠశాలలో డిప్యూటేషన్ పై పనిచేస్తున్న ఉపాధ్యాయుడు చేత ఇరువురి విలేకరులపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగింది. ఇట్టి విషయాలపై పూర్తిస్థాయి విచారణ జరిపి జర్నలిస్టులకు న్యాయం చేయాలని టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ ఆధ్వర్యంలో జర్నలిస్టు ప్రతినిధుల బృందం రూరల్ ఏసిపి తిరుపతిరెడ్డిని మంగళవారం కలిశారు. అందుకు స్పందించిన రూరల్ ఏసిపి మరో మారు విచారణ చేసి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి రజినీకాంత్, జిల్లా ఉపాధ్యక్షులు ఉపేందర్, భాస్కర్, మందుల ఉపేందర్, ఎలక్ట్రానిక్ మీడియా నగర అధ్యక్ష, కార్యదర్శులు యలమందల జగదీష్, కరీష అశోక్, సాయి, ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కొరకొప్పుల రాంబాబు, జిల్లా నాయకులు రోసిరెడ్డి, బండి కుమార్, వెంకటేశ్వర్లు, వెంకట్ తదితరులున్నారు.

# కరపత్రాలను ఆవిష్కరించిన విద్యార్థులు

**– రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దమళ్ళ సత్యనారాయణ**




ఖమ్మం, మార్చి 23:(నేటినిజం ప్రతినిధి): అంబేద్కర్ యువజన సంఘం, తెలంగాణ సోషలిస్టు స్టూడెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక భద్రాచలం బీసీ బాలుర వసతి గృహంలో మహనీయుల జయంతి కరపత్రాలను రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దమళ్ల సత్యనారాయణ విద్యార్థులతో కలిసి ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...సామాజిక విప్లవకారుడు మహాత్మజ్యోతి బాపూలేకు భారతరత్న ప్రకటించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఎంతోమందికి ఉచిత విద్య, మహిళలకు విద్య కల్పించిన మహానుభావుడు మహాత్మజ్యోతి బాపూలే కు భారతరత్న ప్రకటించకపోవడం చాలా బాధాకరం దురదృష్టకరమని కాబట్టి ఇప్పటికైనా ప్రభుత్వాలు మేలుకొని మహాత్మ జ్యోతి బాపూలే కు భారతరత్న ప్రకటించాలని తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ తరపున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరంతరం విద్యార్థుల కోసం వారి డైట్ ఫీజుల కోసం, మేస్ చార్జీల కోసం పోరాటం చేస్తున్న ఏకైక సంస్థ టిఎస్ఎస్సి అని వారు అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వం లాగా కాకుండా కొత్త ప్రభుత్వం విద్యార్థుల పట్ల నిరుద్యోగుల పట్ల వారికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ బాలుర వసతి గృహ విద్యార్థులు పాల్గొన్నారు.

# మానస సరోవర పిరమిడ్ క్షేత్రాన్ని దర్శించిన కోవూరి

విజయవాడ మార్చ్ 26 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: విజయవాడలో మానస సరోవర పిరమిడ్ క్షేత్రాన్ని దర్శించిన తెలంగాణ బీసీవై పార్టీ సంగారెడ్డి నియోజకవర్గం ఇంచార్జ్ న్యాయవాది కోవూరి సత్యనారాయణ గౌడ్ నేడు సందర్శించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ విజయవాడలో మానస సరోవర పిరమిడ్ క్షేత్రాన్ని రామ్ రెడ్డి ఎంతో సుందర వందనంగా తీర్చిదిద్ది ప్రకృతి సిద్దమైన ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పరచి ధ్యానం యొక్క విలువను, పత్రీజీ గారి ఆశయాలను నేటి భావితరాలకు మార్గదర్శకాలుగా ఉండే విధంగా తీర్చిదిద్దుతున్నారని అన్నారు. అందుకు మానస సరోవర పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ రామ్ రెడ్డికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.మానస సరోవర పిరమిడ్ క్షేత్రాన్ని దర్శించిన తెలంగాణ బీసీవై పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేసిన పరకాల నియోజకవర్గం ఇంచార్జ్ అబ్బా డి బుచ్చిరెడ్డి, అందోల్ నియోజకవర్గం ఇంచార్జ్ ఎర్రారం దేవదాస్, ఎల్లారెడ్డి నియోజకవర్గము ఇన్చార్జ పెద్ద గొల్ల జై కుమార్, కోరుట్ల నియోజకవర్గం ఇంచార్జ్ న్యాయవాది సాయి కృష్ణ యాదవ్ మరియు ప్రముఖ నాయకులు ఉన్నారు.

# రేషన్‌ను ప్రహసనం చేస్తే డీలర్ షిప్ రద్దు ఖాయం

**-పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్ మెంట్ డి టి- మాచన రఘునందన్**




హైదరాబాద్, మార్చి 26:ప్రజా పంపిణీ ని ప్రహసనం చేస్తే డీలర్ షిప్ రద్దు చేయడం ఖాయం అని పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్ మెంట్ డి టీ మాచన రఘునందన్ హెచ్చరించారు. శనివారం నాడు రఘునందన్ శేరిలింగం పల్లి తారా నగర్ లో చౌక దుకాణాన్ని తాత్కాలికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రఘునందన్ మాట్లాడుతూ..

సరుకుల పంపిణీ సరిగ్గా చేయక పోవడమే గాక,రేషన్ షాపు నిర్వహణ సరిగా లేదన్న పిర్యాదుల నేపథ్యంలో 436 చౌక దుకాణాన్ని తాత్కాలికంగా సీల్ చేసినట్టు వివరించారు.నెలల తరబడి షాపు తీయటం లేదని కొందరు స్థానికులు సైతం ఫిర్యాదు చేసినట్టు రఘునందన్ వివరించారు.

రేషన్ నిర్వహణ అస్తవ్యస్తం కావడం తో కనీసం తనిఖీ కి కూడా అవకాశం లేక పోవడం వల్ల చౌక దుకాణాన్ని సీల్ చేసినట్టు చెప్పారు.

# పిఠాపురానికి ఆరు గ్యారెంటీలు.. ప్రకటించిన జనసేనాని

**-30 నుంచి పిఠాపురంలో ఎన్నికల ప్రచారం**

**-తూర్పు, పశ్చిమంలో ఏకధాటిగా పర్యటనలు**

**-వారాహి వాహనంలోనే విస్తృత ప్రచారం**

**-షెడ్యూల్ ఖరారులో పవన్ యంత్రాంగం**

అమరావతి, మార్చి 26:సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ రానున్న వేళ ఏపీలో తెలుగుదేశం– జనసేన– బీజేపీ కూటమి ప్రచార కార్యక్రమాలపై దృష్టి సారించింది. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ దాదాపుగా పూర్తయింది. కొన్ని సీట్లు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. కాకినాడ జిల్లా పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కూటమి అభ్యర్థిగా పవన్ కల్యాణ్ పోటీ చేయబోతోన్నారు. ఇప్పటికే ఆయన అభ్యర్థిత్వం ఖరారైంది. ఇక నియోజకవర్గంలో ప్రచారానికి సిద్ధపడుతున్నారు. ఈ నెల 30న ఆయన పిఠాపురానికి వెళ్లనున్నారు. వారాహి వాహనంలో నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటన చేపట్టనున్నారు. దీనితో పాటు జనసేన పార్టీ అధినేతగా అన్ని జిల్లాల్లోనూ పర్యటించనున్నారు. కూటమి బహిరంగ సభలు, రోడ్ షోల్లో పవన్ కళ్యాణ్ పాల్గొననున్నారు. ఎక్కువగా కాకినాడ, ఏలూరు, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాల్లో ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పవన్ పాల్గొనే అవకాశాలున్నాయి. కాపు సామాజిక వర్గం ఓటుబ్యాంకు అధికంగా ఉండే జిల్లాలు కావడమే దీనికి ప్రధాన కారణంగా పార్టీ నేతలు చెబుతున్నారు.

**ఆరు వరాలతో ఆకట్టుకునే యత్నం..**

పిఠాపురంలో ప్రచారానికి శ్రీకారం చుట్టడానికి ముందే పవన్ కల్యాణ్ ఆ నియోజకవర్గంపై వరాలను కురిపిస్తున్నారు. శాసన సభ్యుడిగా తనను ఎన్నుకుంటే ఎలాంటి అభివృద్ధి పనులను చేపడతాననేది ప్రకటించారు. అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన రోజు నుంచే వాటిని నెరవేర్చేలా కృషి చేస్తానని అన్నారు. ఈ క్రమంలో ఆరు హామీలను పిఠాపురం ఓటర్లకు వరంగా ఇవ్వబోతున్నారు.

యువత సహా అర్హులైన వారందరికీ ఉద్యోగ అవకాశాల కల్పన

చేనేత రంగాన్ని అభివృద్ధి చేయడం

ఆధ్యాత్మిక కేంద్రంగా పిఠాపురాన్ని అభివృద్ధి

పర్యాటక కేంద్రంగానూ అభివృద్ధి పర్చడం

ఇక్కడి మత్స్యకారులకు ప్రత్యేకంగా జెట్టీల నిర్మాణాన్ని చేపట్టడం

కోస్టల్ కారిడార్‌పై ప్రత్యేక దృష్టి సారించడం– అనే ఆరు హామీలను పవన్ కల్యాణ్ ప్రకటించారు.

ఇది తామిచ్చే వాగ్దానమని, తనను గెలిపించుకోవడం పిఠాపురం ప్రజల బాధ్యత అంటూ కొత్త స్లోగన్‌ను పవన్ కల్యాణ్ తీసుకొచ్చారు. ఇవే హామీలు, ఇదే నినాదంతో పిఠాపురం ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటారని జనసేన పార్టీ వర్గాలు వెల్లడించాయి.

# త్వరలోనే పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ భారతదేశంలో విలీనం

**- భారత రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సంచలన వ్యాఖ్యలు**

న్యూ డిల్లీ మార్చ్ 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );లోక్‌సభ ఎన్నికల వేళ భారత రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ త్వరలోనే భారతదేశంలో విలీనమవుతుందని అన్నారు. హోలీ పండుగ సందర్భంగా లఢఖ్‌లోని లేహ్ సైనిక స్థావరాన్ని రాజ్‌నాథ్ సందర్శించారు. అక్కడ మాట్లాడుతూ ఆయన పై వ్యాఖ్యలు చేశారు.ఆ తర్వాత జవాన్‌లతో కలిసి రాజ్‌నాథ్ సింగ్ హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. త్వరలోనే పీవోకే భారత్‌లో విలీనమవుతుందని, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని ప్రజలు భారత్‌లో తమ ప్రాంతాన్ని విలీనం చేసుకోవాలని డిమాండ్ చేస్తున్నారని ఆయన చెప్పారు.పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారుతున్నాయని రాజ్‌నాథ్ పేర్కొన్నారు. త్వరలోనే భారత్‌లో పీవోకే విలీనమవుతందనే విశ్వాసం తనకు వంద శాతం ఉందని చెప్పారు. ఢిల్లీ దేశానికి రాజధాని, ముంబై ఆర్థిక రాజధాని కాగా, లఢఖ్ మన దేశ శౌర్యానికి రాజధాని అవుతుందని రక్షణ మంత్రి అభివర్ణించారు.

# వైసీపీ వైనాట్ 175 నినాదంపై పురంధేశ్వరి విమర్శలు

అమరావతి, మార్చి 26: వైసీపీ వైనాట్ 175 నినాదంపై ఏపీ బీజేపీ చీఫ్ పురంధేశ్వరి విమర్శించారు. విజయవాడలో ఇవాళ బీజేపీ పదాధికారుల సమావేశం నిర్వహించారు. పురంధేశ్వరి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి.. ఆ పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకులు హాజరయ్యారు.

ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో దౌర్జన్యం చేయ డానికి వైసీపీ రెడీ అయ్యిందన్నారు. దొంగ ఓట్లతో వైనాట్ 175 అని చెబుతున్నారని విమర్శించారు. రాష్ట్ర పరిస్థితుల దృష్ట్యా అగ్ర నాయకత్వం కూటమి నిర్ణయం తీసుకుందన్నారు. కొందరికి నచ్చకపోయినా పార్టీ నిర్ణయాన్ని గౌరవించాలన్నారు. ఎన్నికల్లో.. ప్రచారం, పోల్ మేనేజ్‌మెంట్‌పై ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు జాతీయ నేతలు దిశానిర్దేశం చేస్తున్నారు.

# పేరోల్ డేటా: 2024 జనవరి లో ఈపీఎఫ్ఓ లో కొత్తగా చేరిన 16.02 లక్షల నికర చందాదారులు

న్యూఢిల్లీ, మార్చి 26:ఈపీఎఫ్ఓ తాత్కాలిక పేరోల్ వివరాలు 2024 మార్చి 24న విడుదల అయ్యాయి. తాజా వివరాల ప్రకారం 2024 జనవరి నెలలో ఈపీఎఫ్ఓ లో 16.02 లక్షల నికర చందాదారులు చేరారు. 2024 జనవరి నెలలో 8.08 లక్షల మంది ఈపీఎఫ్ఓ సభ్యత్వం పొందారు. సభ్యత్వం పొందిన వారిలో 18–25 మధ్య వయస్సు ఉన్న వారి సంఖ్య ఎక్కువగా ఉంది. 2024 జనవరి లో ఈపీఎఫ్ఓ సభ్యత్వం తీసుకున్న వారిలో 18–25 మధ్య వయస్సు ఉన్న వారి సంఖ్య 56.41%గా ఉంది. ఈ వివరాలు పరి శీలిస్తే యువత పెద్ద సంఖ్యలో ఉపాధి పొంది సంఘటిత ఉపాధి రంగంలో ప్రవేశించారు అని వెల్లడి అవుతుంది.

సుమారు 12.17 లక్షల మంది సభ్యులు నిష్క్రమించి తిరిగి ఈపీఎఫ్ ఓలో చేరారని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఉద్యోగాలు మారిన వారు ఈపీఎఫ్ఓ పరిధిలోకి వచ్చే సంస్థలో చేరి తుది పరిష్కారంగా నిధులు వెనక్కి తీసుకోకుండా తమ సభ్యత్వాన్ని కొనసాగిస్తూ తమ పిఎఫ్ ఖాతాలను వాటిలో ఉన్న మొత్తాన్ని ఇదివరకటి పిఎఫ్ ఖాతా నుంచి ప్రస్తుత పిఎఫ్ ఖాతాకు మళ్ళించు కొనేందుకు ఆసక్తి కనబరిచారు. దీర్ఘ కాల ప్రయోజనాలు, సామాజిక భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడి అవుతోంది.

చందాదారుల సంఖ్యను లింగాల వారీగా విశ్లేషిస్తే కొత్త నమోదు అయిన సభ్యుల సంఖ్యలో మహిళల సంఖ్య 2.05 లక్షలుగా ఉంది. నెలలో చేరిన మొత్తం మహిళల నికర సంఖ్య 3.03 లక్షలుగా ఉంది. పెరిగిన మహిళల సంఖ్య సమీకృత, విభిన్న కార్మిక శక్తిని సూచిస్తుంది.

పరిశ్రమ వారీగా నెలవారి చేరికలను విశ్లేషించినప్పుడు ఆర్థిక సంస్థలు,ఉత్పత్తి, మార్కెటింగ్, కంప్యూటర్ల వినియోగం, ఆసుపత్రులు లాంటి రంగాల్లో ఉపాధి పొందిన వారి సంఖ్య పెరిగిందని వెల్లడి అవుతుంది. చేరిన మొత్తం నికర సభ్యుల్లో 40.71% మంది నైపుణ్య సేవల ( మానవ వనరులు, కాంట్రాక్టర్లు, సెక్యూరిటీ సేవలు, ఇతర సేవలు) రంగంలో ఉన్నారు.

పేరోల్ వివరాలు తాత్కాలిక ప్రాతిపదికన రూపొందించడం జరుగుతుంది. ఉద్యోగుల రికార్డులను ఎప్పటికప్పుడు నవీనీకరణ చేయవలసి ఉంటుంది. ఈ ప్రక్రియలో పేరోల్ వివరాలు మారుతుంటాయి. 2018 ఏప్రిల్ నుంచి 2017 సెప్టెంబర్ తదుపరి కాలానికి సంబంధించి పేరోల్ వివరాలను ఈపీఎఫ్ఓ విడుదల చేసోంది. ఆధార్ ఆధారంగా యూనివర్సల్ అకౌంట్ నెంబర్ (యూఏఎన్) ద్వారా తొలిసారి ఈపీఎఫ్ఓ సభ్యత్వం పొందిన వారి వివరాలు, ఈపీఎఫ్ఓ నుంచి నిష్క్రమించి తిరిగి చేరిన వారి వివరాలు ఆధారంగా నెలవారి ఈపీఎఫ్ఓ పేరోల్ సిద్దమవుతుంది.

# ఆరోగ్య విషయంలో, మెడిసిన్స్ విషయంలో తెలుసుకోవలసిన నిజాలు

**- జనరిక్ మందుల గురించి అందరూ తెలుసుకోవలసిన గొప్ప నిజాలు**
**-అందరికీ జనరిక్ మందుల పట్ల అవగాహన పెంచాలి**
**-జనరిక్ మందులు వాడి డ్రగ్ మరియు ఫార్మా మాఫియా దోపిడీ ని అరికట్టాలి**

హైదరాబాద్ మార్చ్ 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్); ఆరోగ్య విషయంలో,మెడిసిన్స్ విషయంలో తెలుసుకోవలసిన నిజాలు అనేకం ఉన్నాయి.అందులో జనరిక్ మందుల గురించి అందరూ తెలుసుకోవలసిన గొప్ప నిజాలు అనేకం.జనరిక్ మందులకు కంపెనీ మందులకు తేడా ఏముంటుంది.. జనరిక్ మందులకు ధర తక్కువగా ఉంటుంది అలా అని మందులలో ఏమైనా నాణ్యత తక్కువగా వుంటుందా?ఒక కొత్త మందును కనుగొనడానికి ఫార్మా కంపెనీలు అనేక పరిశోధనలు, పరీక్షలు చేసి మందును మార్కెట్ లోకి తీసుకొస్తాయి.అందుకు ప్రతిఫలంగా ఆ మందు తయారీ పై ఆ కంపెనీకి కొంత కాలం పాటు ( 20 సం.లు) పేటెంట్ హక్కులు ఉంటాయి..అలా తయారు చేసిన మందులను బ్రాండెడ్ డ్రగ్స్ లేదా స్టాండర్డ్ డ్రగ్స్ అంటారు.ఆ మందు యొక్క ఫార్ములా తెలిసినా ఏ ఫార్మా కంపెనీ అయినా సరే, దానిని పేటెంట్ ఉన్న కాలంలో పేటెంట్ పొందిన కంపెనీ అనుమతి లేకుండా ఆ మందు తయారు చేయకూడదు. అలా పేటెంట్ లో ఉన్న మందులను ఇతరులు ఎవరైనా తయారు చేసి అమ్మితే వారు శిక్షార్హులౌతారు. అంటే ఆ మందుపై, మొట్ట మొదట తయారు చేసిన కంపెనీకే 20 సంవత్సరాల పాటు గుత్తాది పత్యం ఉంటుంది. నిజానికి ఆ మందును తయారు చేయడానికి అయ్యే ఖర్చుకూ, ఆ మందుపై కంపెనీ వసూలు చేసే అమ్మకపు ధరకు ఏ మాత్రం పొంతన ఉండదు. తయారీ ఖర్చు కంటే మందు యొక్క అమ్మకపు ధర అనేక రెట్లు అధికంగా ఉంటుంది. తయారీ కోసం "పరిశోధనలు మరియూ క్షేత్ర స్థాయి పరీక్షల (అశ్రీతినితిఇజీశ్రీ ితీతిజీశ్రీబ)" నిమిత్తం మాకు చాలా డబ్బు ఖర్చైందని సదరు కంపెనీ వాదిస్తుంది.. కాబట్టి ఓ 20 సంవత్సరాల పాటు ఆ మందుపై దానిని తయారు చేసిన కంపెనీకి పేటెంట్ హక్కులు కల్పించి, పెట్టుబడి సొమ్మును రాబట్టుకోడానికి, ఆ మందును మొట్టమొదట తయారు చేసిన కంపెనీకి అవకాశం ప్రభుత్వం కల్పిస్తుంది.మందు పై చమొట్టమొదటి తయారు చేసిన కంపెనీ యొక్క పేటెంట్ కాలం ముగిసిన తర్వాత, అవే కెమికల్స్ ను ఉపయోగించి, అదే ఫార్ములాతో, అదే మందును ఏ కంపనీ అయినా తయారు చేసి, మార్కెట్ లోకి విడుదల చేయొచ్చు.. అలా తయారు చేసిన మందులను "జనరిక్‌బిడ్రగ్స్" అంటారు.జనరిక్ డ్రగ్స్ తయారు చేయటానికి ఫార్మా కంపెనీలు ఎటువంటి పరిశోధనలు కాని క్లినికల్ ట్రయల్స్ గాని జరపవలసిన అవసరం లేదు. అందువలన జనరిక్ డ్రగ్స్ ధరలు, బ్రాండెడ్ డ్రగ్స్ ధరలతో పోలిస్తే 30 నుండి 80 శాతం తక్కువ ధరలలో లభిస్తాయి. వీటిపై ముద్రించబడే యం.ఆర్.పీ కంటే చాలా తక్కువ రేటుకే వాటిని మనకు అమ్ముతారు. తక్కువ ధరకు లభిస్తున్నాయి కాబట్టి నకిలీ మందులు అని, సరిగా పని చేస్తాయో చేయవో అని భయపడవలసిన అవసరం లేదు. బ్రాండెడ్ మందుల తయారీలో పాటించాల్సిన ప్రమాణాలన్నీ జనరిక్ మందుల తయారీలోను పాటిస్తారు. బ్రాండెడ్ మందులెలా పనిచేస్తాయో, జనరిక్ మందులు కూడా ఖచ్చితంగా అలానే పనిచేస్తాయి.?? కాని ప్రజలు జనరిక్ మందులకు అలవాటు పడితే ఫార్మాస్యూటికల్స్ కంపెనీలకూ, ఫార్మా ఏజెన్సీలకూ, మందుల షాపులకూ, అందరికీ నష్టమే కదా.అందుకనే జనరిక్ మందులపై, అవి బ్రాండెడ్ మందుల్లా పనిచేయవన్న పుకార్లు లేవదీస్తున్నారు.. అది నిజం కాదు జనరిక్ మందులు బ్రాండెడ్ మందులతో సమానంగా పని చేస్తాయి.బ్రాండెడ్ మందులు తయారు చేసే ఫార్మా కంపెనీలు మెడికల్ రిప్రజెంటేటివ్స్ ద్వారా డాక్టర్లకు తమ బ్రాండెడ్ ఔషధాల గురించి ఎప్పటికప్పుడు తెలియజేస్తూ వాటిని సూచించమని కోరుతుంటాయి. డాక్టర్ ఎంతమేర రాస్తే.. అంతమేర ప్రతిఫలాలను ముట్టజెబుతాయి. ఈ ఫలాలు ఉచిత విదేశీ పర్యటనలు, చెక్, బహుమతులు ఇలా పలు రూపాలుగా ఉంటాయి. అందుకే బ్రాండెడ్ ఔషధాలు చాలా ఖరీదుగా ఉంటాయి.కొంత మంది వైద్యులు జనరిక్ మందులను సూచిస్తుంటారు. అవి వారి ఆస్పత్రి ప్రాంగణంలోనే లభిస్తాయి. వాటి ధర వాస్తవానికి చాలా తక్కువగా ఉన్నప్పటికీ వాటి మీద మీద ముద్రించబడిన ధర చాలా ఎక్కువగా ఉంటుంది. కస్టమర్ అడిగితే ఒక 10 శాతం తగ్గిస్తారు. దాంతో కస్టమర్ సంతోషిస్తాడు. కాని ముద్రిత ధర కంటే 50 నుంచి 80 శాతం వరకు తక్కువ ధర ఉంటుంది.ఉదాహరణకు జ్వరానికి సాధారణంగా డాక్టర్ వద్దకు వెల్లకుండానే చాలా మంది వాడే మందు "డోలో 650" (పారసెటమాల్ 650 మి గ్రా.) దీని ధర 15 టాబ్లెట్లకు 29 /- రూపాయలు. ఇదే టాబ్లెట్ ను సిప్లా కంపని "పారాసిప్ 650" పేరుతో తయారు చేసి అమ్ముతుంది , దాని ధర 10 టాబ్లెట్ లకు 18/- రూపాయలు. నిజానికి జనరిక్ మెడికల్ షాపులలో పారసెటమాల్ 650 మి గ్రా.రూ. 4.50 /- లకు పది టాబ్లెట్ లభిస్తాయి.నొప్పి నివారణకు వాడే డైక్లో ఫెనాక్ సోడియం ఎస్ఆర్ బ్రాండెడ్ (వోవిరాన్)10 మందుల ధర 51.91. కానీ ఇదే ఔషధం 10 మందుల జనరిక్ ధర జనఔషధి స్టోర్ లో ఖీబ. 3.35 మాత్రమే. 100 ఎంఎల్ కాఫ్ సిరప్ బ్రాండెడ్ వి అయితే 33 రూపాయలు పైనే. జనరిక్ దగ్గు మందు జనఔషధి స్టోర్ లో 13 రూపాయలకే లభిస్తుంది. జ్వరం తగ్గడానికి వాడే ప్యారాసిటవమాల్ 500 మి గ్రా. 10 మాత్రల ధర (బ్రాండెడ్ అయితే 13 రూపాయలు. జనరిక్ అయితే 2.45రూపాయలే.?? సూక్ష్మంగా చెప్పాలంటే బేసిక్ ఫార్ములా ప్రకారం తయారైన మందును జనరిక్ మందు అంటారు. ఇదే సూత్రంతో కార్పొరేట్ కంపెనీలు పేరు మార్చి మందులు ఉత్పత్తి చేస్తున్నాయి. ధరలో తేడా తప్పితే మందు పనిచేయడంలో ఎలాంటి వ్యత్యాసం ఉండదు. మందు పరిమాణం, రసాయనిక నామం, న్యాణ్య ఒక్కటే గానీ.. లేబుల్, దానిపై బ్రాండ్ పేరు మారుతుంది.జనరిక్ మందుల పట్ల సామాన్య ప్రజలకు చాలా అపోహలు అనుమానాలు న్నాయి. వాటిని గుర్తి వివరించి ఉపయోగించేలా చేసే వ్యవస్థలు లేవు. ఇటీవల కాలంలో టీవీల ప్రజలకు కొంత అవగాహన పెరిగింది.ఔషధి పథకం ద్వారా దేశంలో కొత్తగా 5000 మెడికల్ షాపులను ఏర్పాటు చేసారు. ఇలా ఎంతో మందికి ఉపాధి లభించడమే కాకుండా పేదలకు మందుల ఖర్చు మిగులు తుంది. అందరికీ జనరిక్ మందుల పట్ల అవగాహన పెంచి మనం కూడా వీలైనంత ఆ మందులు వాడి డ్రగ్ మరియు ఫార్మా మాఫియా దోపిడీ ని అరికట్టాలి.

# హైదరాబాద్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థిగా గడ్డం శ్రీనివాస్ యాదవ్

-హైదరాబాద్ మార్చ్ 26 (ఎక్స్ ప్రెస్ స్నెవ్ స్);: లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అన్ని పార్టీల కన్నా ముందే ఎంపీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఇప్పటికే 16 స్థానాలకు అభ్యర్థులను ఖరాలు చేసిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. తాజాగా హైదరాబాద్ లోక్‌సభ స్థానానికి కూడా అభ్యర్థిని ఫైనల్ చేశారు. హైదరాబాద్ నుంచి గడ్డం శ్రీనివాస్ యాదవ్‌ను బరిలోకి దింపాలని నిర్ణయించారు. ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినథులను చర్చించిన తర్వాత కేసీఆర్ ఈ మేరకు ప్రకటించారు. దీంతో రాష్ట్రంలోని మొత్తం పార్లమెంటు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించినట్లయింది. ఎన్నికల్లోనైనా, పార్టీ నిర్మాణంలోనైనా సామాజిక సమతూకం పాటించేది బీఆర్ఎస్ పార్టీయేనని మరోసారి నిరూపితమైంది. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కేసీఆర్ అన్ని వర్గాలకు అవకాశం కల్పించారు. బీసీలకు 6 పార్లమెంట్ స్థానాల్లో పోటీచేసే అవకాశాన్ని కల్పించారు. బీసీల్లోనూ మున్నూరుకాపులకు రెండు (జహీరాబాద్, నిజామాబాద్) పార్లమెంట్ స్థానాలు కేటాయించగా, చేవెళ్ల స్థానాన్ని ముదిరాజ్‌లకు, సికింద్రాబాద్‌ను గౌడ సామాజికవర్గానికి, భువనగిరి, హైదరాబాద్ స్థానాలను యాదవులకు కేటాయించారు. మహబూబ్‌నగర్, నల్లగొండ, మెదక్, మల్కాజిగిరి స్థానాలను రెడ్డి సామాజిక వర్గానికి కేటాయించారు. వెలమ, కమ్మ సామాజిక వర్గానికి ఒక్కో సీటును కేటాయించారు. రిజర్వ్ స్థానాల్లోనూ సమాన అవకాశాలు కల్పించారు. ఎస్టీల్లో ఆదివాసీ, మైదాన గిరిజనులకు సమానంగా సీట్లు ఇచ్చారు.ఆదిలాబాద్ స్థానాన్ని ఆదివాసీ (గోండు) గిరిజనులకు కేటాయించగా, మహబూబాబాద్ స్థానాన్ని మైదాన ప్రాంత గిరిజన (బంజారా/లంబాడా) గిరిజనులకు కేటాయించడం విశేషం. ఎస్సీ నియోజకవర్గాల్లో రెండు స్థానాలు మాదిగ (నాగర్‌కర్నూల్, వరంగల్)లకు, పెద్దపల్లి లోక్‌సభ స్థానాన్ని మాల సామాజిక వర్గానికి కేటాయించారు.

### బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థులు..

-ఆదిలాబాద్- ఆత్రం సక్కు మల్కాజిగిరి- రాగిడి లక్ష్మారెడ్డి, ఖమ్మం- నామా నాగేశ్వర్‌రావు, మహబూబాబాద్- మాలోత్ కవిత, కరీంనగర్- బోయినపల్లి వినోద్ కుమార్, పెద్దపల్లి- కొప్పుల ఈశ్వర్, మహబూబ్‌నగర్- మన్నె శ్రీనివాస రెడ్డి, చేవెళ్ల- కాసాని జ్ఞానేశ్వర్, వరంగల్- కడియం కావ్య, జహీరాబాద్- గాలి అనిల్‌కుమార్, నిజామాబాద్- బాజిరెడ్డి గోవర్ధన్, సికింద్రాబాద్- పద్మారావు గౌడ్, నాగంకర్నూల్- ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, భువనగిరి- క్యామ మల్లేశ్, నల్లగొండ- కంచర్ల కృష్ణారెడ్డి, మెదక్- వెంకట్రామిరెడ్డి, హైదరాబాద్- గడ్డం శ్రీనివాస్ యాదవ్

# స్వంత గూటికి గనుల వ్యాపారి

**-మాజీ సీఎం బీఎస్ యడియూరప్ప, సమక్షంలో బిజెపి లో చేరిన గాలి జనార్దన్ రెడ్డి**



బెంగళూర్ మార్చ్ 26 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);లోక్‌సభ ఎన్నికలకు ముందు కర్ణాటక లో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఒకప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో చక్రం తిప్పిన గనుల వ్యాపారి, మాజీ మంత్రి, కల్యాణ రాజ్య ప్రగతి పక్ష పార్టీ వ్యవస్థాపకుడు గాలి జనార్దన్ రెడ్డి తాజాగా భారతీయ జనతా పార్టీ లో చేరారు. సోమవారం ఉదయం ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ సీఎం బీఎస్ యడియూరప్ప, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బీఐ విజయేందర్ సమక్షంలో భార్య అరుణ లక్ష్మితో కలిసి కమలం పార్టీ కండువా కప్పుకున్నారు. తన కేఆర్‌పీపీ పార్టీని బీజేపీలో విలీనం చేశారు.'ఈ రోజు నేను ఐఖీఖఖని బీజేపీలో విలీనం చేసి ఆ పార్టీలో చేరాను. మూడోసారి మోదీకి మద్దతు ఇవ్వడానికి నేను తిరిగి సొంతగూటికి వచ్చినందుకు సంతోషంగా ఉంది. బేషరతుగా పార్టీలో చేరాను. నాకు ఎటువంటి పదవులూ అవసరం లేదు' అని బీజేపీలో చేరిన అనంతరం గాలి జనార్దన్ రెడ్డి సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. మరోవైపు గాలి జనార్దన్ రెడ్డి దంపతులకు యడియూరప్ప, ఇతర బీజేపీ నేతలు పార్టీలోకి స్వాగతం పలికారు.ఒకప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో చక్రంతిప్పిన గాలి జనార్దన్ రెడ్డి అక్రమ మైనింగ్ తవ్వకాల కేసులో అరెస్టైన విషయం తెలిసిందే. ఈ కేసులో సీబీఐ అధికారులు 2011 సెప్టెంబర్ ఆయన్ని అరెస్ట్ చేశారు. జామీనుపై బయటకు వచ్చిన గాలి మళ్లీ రాజకీయాల్లో కొనసాగుతున్నారు. అయితే, గతంలోలాగా పెద్దగా ప్రభావం చూపలేకపోతున్నారు. గత ఎన్నికల్లో తన పార్టీ తరపున ఆయన ఒక్కరే ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో తాజాగా బీజేపీలో చేరి తనపార్టీని విలీనం చేశారు. తాజా పరిణామంతో బళ్లారి, కొప్పళ, రాయచూర్, హావేరి జిల్లాల్లో పార్టీకి మరింత బలం వస్తుందని కమలనాథులు భావిస్తున్నారు.

# తాగునీటి వృథాపై అధికారులు చర్యలు

**-22 కుటుంబాలకు రూ.5,000 చొప్పున జరిమానా**

బెంగళూరు మార్చ్ 26 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: కర్ణాటక రాజధాని బెంగళూరు తీవ్ర నీటి కొరతను ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో తాగునీటి వృథాపై అధికారులు చర్యలు చేపట్టారు. 22 కుటుంబాలకు రూ.5,000 చొప్పున జరిమానా విధించారు. లక్షకు పైగా వసూలు చేశారు. మరోసారి తాగు నీటి వృథాకు పాల్పడితే అదనంగా రూ.500 ఫైన్ విధిస్తామని హెచ్చరించారు. నీటి ఎద్దడి నేపథ్యంలో బెంగళూరు ప్రజలు పలు ఇబ్బందులు పడుతున్నారు. అయితే కొంత మంది మాత్రం తాగునీటిని వృథా చేస్తున్నారు. కార్ల వాషింగ్, గార్డెనింగ్‌కు కూడా తాగునీటిని వినియోగిస్తున్నారు.కాగా, బెంగళూరు నీటి సరఫరా, మురుగునీటి బోర్డు (బీడబ్ల్యూఎస్ఎస్‌బీ) దీనిపై స్పందించింది. తాగునీటి వృథాకు పాల్పడిన 22 కుటుంబాలకు రూ.5,000 చొప్పున జరిమానా విధించింది. నగరంలోని పలు ప్రాంతాల నుంచి రూ.1.1 లక్షల జరిమానా వసూలు చేసినట్లు అధికారులు తెలిపారు. ఒక్క దక్షిణ ప్రాంతం నుంచే అత్యధికంగా రూ. 80,000 ఫైన్ వసూలు చేసినట్లు చెప్పారు. అలాగే హోలీ వేడుక సందర్భంగా నీటి వృథాకు పాల్పడవద్దని అధికారులు హెచ్చరించారు. పూల్ పార్టీలు, రెయిన్ డ్యాన్స్‌లకు దూరంగా ఉండాలని కావేరి, బోర్‌వెల్ నీటిని వినియోగించవద్దని సూచించారు.

# రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే ప్రకటన చేయాలి

**-మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్**

హైదరాబాద్ మార్చ్ 26 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: పంట రుణాలు తీసుకున్న రైతులకు బ్యాంకర్ల నుంచి వేధింపులు అధికమయ్యాయని, ఈ నేపథ్యంలో రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే ప్రకటన చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు.రైతుబంధు లేక, నీళ్లు, కరెంట్ సరిగ్గా లేక పంటలు ఎండిపోతుంటే.. మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు.. బ్యాంకుల వారు అప్పులు కట్టాలని రైతులకు నోటీసులు జారీ చేస్తున్నారు. కోర్టుల్లో కేసులు పెడుతామని లీగల్ నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వ వైఫల్యం వల్ల రైతుబంధు, నీళ్లు, కరెంట్ రాక పంటలు ఎండిపోయి ఆందోళనలో ఉన్నారు. మరోవైపు పంట రుణాలు కట్టాలని బ్యాంకు అధికారులు గ్రామాలపై పడుతున్నారు. ఇవాళ బ్యాంకు అధికారులు నోటీసులు ఇవ్వడమే కాదు.. రైతులను బెదిరిస్తున్నారు. బకాయిలు కట్టకపోతే ఆస్తులు సీజ్ చేసి కోర్టుకు లాగుతాం అంటున్నారు. బ్యాంకు అధికారులు రజాకార్ల మాదిరిగా గ్రామాల మీద పడి రైతులను వేధిస్తున్నారు అని హరీశరావు గుర్తు చేశారు.

### ప్రమాణస్వీకారం చేసి 100 రోజులు దాటింది..

డిసెంబర్ 9న నా మొదటి సంతకం రైతు రుణమాఫీపై చేస్తానని రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో చెప్పారు. ఏకకాలంలో రూ. 2 లక్షల వరకు రుణాలు మాఫీ చేస్తామని నమ్మించే ప్రయత్నం చేశారు. బ్యాంకుకు వెళ్లి అప్పులు తెచ్చుకోండి.. మేం కడుతాం అన్నారు. కానీ డిసెంబర్ 9 కంటే రెండు రోజుల ముందే ప్రమాణస్వీకారం చేశారు. ప్రమాణస్వీకారం చేసి 100 రోజులు దాటింది. ఇప్పటికీ రుణమాఫీపై మీ ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదు. బ్యాంకులకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదు. దీంతో రైతులను బ్యాంకర్లు భయభ్రాంతులకు గురి చేస్తున్నారు అని హరీశ్‌రావు మండిపడ్డారు.

### ఏ ముఖం పెట్టుకుని పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు అడుగుతారు..?

రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతులను దగా, మోసం చేసింది. మొండి చేయి చూపింది. రైతుల విషయంలోనే కాదు.. ఇతర అంశాల్లో కూడా మోసం చేస్తోంది. మేనిఫెస్టోలో చెప్పిన ఏ ఒక్క అంశాన్ని కూడా అమలు చేయలేదు. మాట నిలబెట్టుకోలేదు. 100 రోజుల్లో 13 హామీలు అమలు చేస్తామని చెప్పారు. రైతుల విషయంలో డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తామన్నారు. కౌలు రైతులకు ఎకరానికి రూ. 15 వేలు, వ్యవసాయ కూలీలకు రూ. 12 వేలు, వరి పంటకు క్వింటాలక్‌కు రూ. 500 బోనస్ ఇస్తామన్నారు. ఇవి అమలు చేయలేదు. రైతులను నట్టేట ముంచింది కాంగ్రెస్ ప్రభుత్వం. ఏ ముఖం పెట్టుకుని పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు అడుగుతారు..? బాండు పేపర్ల సాక్షిగా రైతులను మోసం చేశామని ఓట్లు అడుగుతారా..? పదేండ్లలో ఎన్నడూ లేని విధంగా 20 లక్షల ఎకరాల్లో పంట ఎండబెట్టామని ఓట్లు అడుగుతారా..? నీటి నిర్వహణ, కరెంట్ సరిగా ఇవ్వలేదని ఓట్లు వేయమని అడగడానికి గ్రామాల్లోకి వస్తారా..? అని హరీశ్‌రావు నిలదీశారు.

### రైతులకు అండగా బీఆర్ఎస్..

ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణమాఫీ ప్రకటించాలి. లేదంటే రైతులు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కర్రుకాల్చి వాత పెట్టడం ఖాయం. ఈ సందర్భగా రైతులకు విజ్ఞప్తి చేస్తున్నాం. అప్పులు కట్టొద్దు.. రైతులకు బీఆర్ఎస్ అండగా ఉంటుంది. అధికారులు వేధిస్తే.. మా దృష్టికి తీసుకొస్తే మీకు అండంగా ఉంటాం. రుణమాఫీ కోసం కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ పార్టీ పోరాడుతోంది. ఈ ప్రభుత్వం దిగిరాకపోతే రాష్ట్రంలోని లక్షలాది రైతులతో సెక్రటేరియట్‌ను ముట్టడించడానికి బీఆర్ఎస్ పార్టీ వెనుకాడదని హెచ్చరిస్తున్నాం. రాష్ట్రంలో ఆందోళన లో ఉన్న రైతాంగానికి భరోసా కల్పి ంచాలి అని హరీశ్‌రావు సూచించారు.

# అన్నప్రాసన వేడుకలో పాల్గొన్న వైరా ఆత్మ కమిటీ చైర్మన్ కోసూరి శ్రీనివాసరావు



ఖమ్మం, మార్చి 26:(నేటినిజం ప్రతినిధి): కొణిజర్ల మండలం బస్వాపురం గ్రామంలో సముద్రాల బాబు లక్ష్మి దంపతుల మనవరాలు వర్షితకి అన్న ప్రాసన్న వేడుక కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించిన వైరా నియోజ కవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ కోసూరి శ్రీనివాసరావు, నాయకులు యలమంచిలి మధు, తుమ్మ అప్పారావు, నల్లమోతు లక్ష్మయ్య, అడపా మధుసూదన్, మద్దిన్ని భద్రయ్య, ఇంజం రమేష్, మోహన్ రావు, తాటికాయల శ్రీను, చల్లా బాబు, కందుల ఏడుకొండలు, వగదాల నతీష్, షేక్ లాల్ బాబు, యాని లక్ష్మీనారాయణ, బంగారు కృష్ణ, సైదులు, సముద్రాల నాగభూషణం, పెనుగొండ సాయి వంశీ, తదితరులున్నారు.

# గ్యాల్ త్సుయెన్ జెత్సున్ పేమా వాంగ్‌చుక్ మాత, శిశువుల ఆసుపత్రి ప్రారంభం

న్యూఢిల్లీ, మార్చి 26:గ్యాల్ త్సుయెన్ జెత్సున్ పేమా వాంగ్‌చుక్ మాత శిశువుల ఆసుపత్రి ని థింపూ లో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ మరియు భూటాన్ యొక్క ప్రధాని శ్రీ త్సెరింగ్ టోబ్ గే లు కలసి ప్రారంభించారు. ఈ అత్యాధునిక ఆసుపత్రి ని భారత ప్రభుత్వం యొక్క సహాయం తో నిర్మించడమైంది

రెండు దశల లో 150 పడకల గ్యాల్ త్సుయెన్ జెత్సున్ పేమా వాంగ్‌చుక్ మాత, శిశువు ల ఆసుపత్రి ని అభివృద్ధి పరచే కార్యక్రమానికి భారత ప్రభుత్వం సహాయాన్ని అందించింది. ఈ ఆసుపత్రి లో ఒకటో దశ ను 22 కోట్ల రూపాయల ఖర్చు తో నిర్మించగా, 2019 వ సంవత్సరం లో అది పని చేయడం ప్రారంభించింది. ఆసుపత్రి లో రెండో దశ నిర్మాణాన్ని పన్నెండో పంచవర్ష ప్రణాళిక లో భాగం గా 119 కోట్ల రూపాయల ఖర్చు తో 2019 వ సంవత్సరం లోనే మొదలుపెట్టగా అది ఇప్పుడు పూర్తి అయింది.

క్రొత్త గా నిర్మించిన ఆసుపత్రి భూటాన్ లో మాతృమూర్తులు మరియు శిశువుల ఆరోగ్య సంబంధి సేవల నాణ్యత ను పెంచనుంది. ఈ క్రొత్త ఆసుపత్రి లో బాలల వైద్య చికిత్స, మహిళల రోగాలు మరియు ప్రసూతి విజ్ఞా?నం సంబంధి సేవ లు, ప్రసవ వేదిక ఉపకరణ కారక సేవ లు, శస్త్ర చికిత్సాలయం, పసికందుల సంరక్షణ సంబంధి సేవ లు మరియు పీడియేట్రిక్ ఇంటెన్సివ్ కేయర్ విభాగాల లో అత్యాధునిక సదుపాయాలు అందుబాటు లో ఉంటాయి.

ఆరోగ్య సేవల రంగం లో భారత దేశం - భూటాన్ భాగస్వామ్యానికి ఒక అద్భుతమైన ఉదాహరణ గా గ్యాల్ త్సుయెన్ పేమా వాంగ్ చుక్ మాతా, శిశువుల ఆసుపత్రి నిలుస్తోంది.


## సుగుణ సాహితి సమితి-సిద్ధిపేట.

సుగుణ సాహితీ సమితి

**ఉగాది బాలల కథల పోటీ-2024 ఫలితాలు**

బాలల్లో సాహిత్యాభిరుచిని పెంపొందించడానికి, వారిలో దాగివున్న సృజనాత్మకతను వెలికితీయడానికి సిద్ధిపేట జిల్లా స్థాయిలో పాఠశాల విద్యార్థులకు కథల పోటీ నిర్వహించాలనే మా ప్రయత్నానికి మంచి స్పందన లభించింది. మొత్తం 270 కథలు పోటీకి వచ్చాయి. ఈ పోటీలో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులందరికీ అభినందనలు. న్యాయనిర్ణేతగా వ్యవహరించిన ప్రముఖ రచయిత్రి, బాలసాహితీవేత్త డా॥ నీరజ అమరవాది గారికి ప్రత్యేక ధన్యవాదములు.

**బహుమతి పొందిన కథల వివరాలు**

| | | |
|---|---|---|
| **ప్రథమ బహుమతి (1500/- నగదు)** | | |
| 'ఉచితం' ఉచితం కాదు | : | పి. అభిలాష్ (ప్రా.ఉ.పా. చందాపూర్) |
| **ద్వితీయ బహుమతులు (1000/- నగదు)** | | |
| ప్లాస్టిక్ వలన నష్టాలు | : | జి. నిహారిక (జి.ప.ఉ.పా.ఘణపురం) |
| పట్టుదల | : | పి. ఆసీఫా (జి.ప.ఉ.పా.ముబారస్‌పూర్) |
| **తృతీయ బహుమతులు (500/- నగదు)** | | |
| సమానత్వం | : | పి. వైష్ణవి (జి.ప.ఉ.పా. జక్కాపూర్) |
| బుద్ధిబలం | : | జి. ప్రణయ్ చంద్ర (జి.ప.ఉ.పా. చిన్నకోడూర్) |
| ఏది ముఖ్యం | : | జె. నిరీక్షిత (జి.ప.ఉ.పా. వెంకట్రావ్‌పేట) |
| **ప్రోత్సాహక బహుమతులు ( 300 / - నగదు )** | | |
| 1. చరవాణి మహిమ | : | వై. శ్రావణి (ఆదర్శ పాఠశాల, బెజ్జంకి) |
| 2. అనాథ బాలుడు | : | యు. మాధురి (జి.ప.ఉ.పా. ఖమ్మంపల్లి) |
| 3. లక్ష్యం | : | పి. అభిరామ్ (జి.ప.ఉ.పా.రామంచ) |
| 4. అనుభవంతో విద్య | : | వై. సహస్ర (శ్రీ చైతన్య టెక్నో స్కూల్, సిద్దిపేట) |
| 5. నిర్లక్ష్యం | : | ఎ. శృతి (జి.ప ఉ.పా శనిగరం) |
| 6. మీరు కూర్చోండి | : | బి. దివ్య (జి.ప.ఉ.పా. కుకునూర్‌పల్లి) |
| 7. మంచి మలుపు | : | బి. రుచిత్ (జి.ప.ఉ.పా గుర్రాలగొంది) |
| 8. ధైర్యమే జీవితం | : | యం. వరుణ్‌తేజ్ (మెరీడియన్ హైస్కూల్, సిద్దిపేట.) |
| 9. ఐకమత్యం | : | యన్. ప్రణీత (జి.ప.ఉ.పా.చిన్నకోడూర్) |
| 10. ఫోన్‌తో జాగ్రత్త | : | జి. ఆనంది (జి.ప.ఉ.పా.ఇందిరానగర్) |
| 11. వేపచెట్టు | : | జి. మధుప్రియ (జి.ప.ఉ.పా. ముబారస్‌పూర్) |
| 12. ప్లాస్టిక్ నిషేధం | : | యం. హారిక (జి.ప.ఉ.పా. లక్ష్మీదేవిపల్లి) |
| 13. జీవనోపాధి | : | యం. గణేష్ (జి.ప.ఉ.పా. జక్కాపూర్) |
| 14. కష్టానికి తగిన ఫలితం | : | పి. సంజన (జి.ప.ఉ.పా.లక్ష్మీదేవిపల్లి) |

బహుమతి ప్రదాత : **శ్రీ ఆచార్య మర్పడగ చెన్నకృష్ణారెడ్డి గారు**
ఉస్మానియా విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు

అధ్యక్షులు : **మొసర్ల మాధవరెడ్డి**, సుగుణ సాహితి సమితి, సిద్దిపేట.

కన్వీనర్ : **భైతి దుర్గయ్య**, సుగుణ సాహితి సమితి, సిద్దిపేట.9959007914


# ఆమ్ ఆద్మీ పార్టీకి ఖలిస్తానీ గ్రూపులు భారీ ఆర్థిక సహాయం

**- ఆమ్ ఆద్మీకి వంద కోట్లు ఇచ్చాం : ఖలిస్తానీ నేత పన్నున్**

న్యూఢిల్లీ మార్చ్ 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఖలిస్తానీ ఉగ్రవాది, సిక్స్ ఫర్ జస్టిస్ చీఫ్ గురుపర్వత్ సింగ్ పన్నున్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఆమ్ ఆద్మీ పార్టీకి ఖలిస్తానీ గ్రూపులు భారీ ఆర్థిక సాయాన్ని అందించినట్లు చెప్పారు. 2014 నుంచి 2022 వరకు సుమారు 133.54 కోట్ల డబ్బును ఆమ్ ఆద్మీ పార్టీకి ఖలిస్తానీలు ట్రాన్స్‌ఫర్ చేసినట్లు పన్నున్ తెలిపారు. దీనికి సంబంధించి సోషల్ మీడియాలో ఓ వీడియో వైరల్ అవుతోంది. దేవిందర్ పాల్ సింగ్ బుల్లార్ రిలీజ్ కోసం ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ డబ్బులు తీసుకున్నట్లు ఆ వీడియోలో పన్నున్ ఆరోపించారు. 1993 ఢిల్లీ బాంబు బ్లాస్ట్ కేసులో బుల్లార్ నిందితుడిగా ఉన్నాడు. మరోవైపు మద్యం కుంభకోణం కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ప్రస్తుతం ఈడీ కస్టడీలో ఉన్న విషయం తెలిసిందే. కస్టడీలోనే ఉంటూనే సీఎం కేజ్రీవాల్ ఆదేశాలు జారీ చేస్తున్నారు. మద్యం కుంభకోణం జరిగిన సమయంలో కేజ్రీవాల్ వాడిన ఫోన్ ప్రస్తుతం మిస్సింగ్‌లో ఉన్నట్లు అధికారులు తెలిపారు.

# ఎన్నికల్లో అవకాశం రాకపోవడంతో ఎంపీ మనోవేదన..

**- పురుగుల మందు తాగి ఆసుపత్రిలో చేరిన వైనం**

చెన్నయ్ మార్చ్ 26 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఓ ఎంపీ అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరారు. అయితే ఆయన ఆత్మహత్యకు యత్నించినట్లు సమాచారం. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎండీఎంకే కు చెందిన ఈరోడ్ ఎంపీ గణేశమూర్తి ఆరోగ్యం ఆదివారం ఉదయం హఠాత్తుగా క్షీణించడంతో కుటుంబ సభ్యులు అతడిని కోవైలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు.అయితే, గణేశమూర్తి తాను పురుగుల మందు తాగినట్లు కుటుంబ సభ్యులకు చెప్పినట్లు పోలీసులు తెలిపారు. ఆ తర్వాత ఆయన తీవ్ర అస్వస్థతకు లోనైనట్లు వెల్లడించారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు గణేశమూర్తిని కోవైలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారని.. అక్కడ పరీక్షించిన వైద్యులు అతడిని వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందించినట్లు వివరించారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటల తర్వాత మెరుగైన వైద్యం కోసం కోయంబత్తూర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు చెప్పారు. ప్రస్తుతం అతను ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు వెల్లడించారు. మరోవైపు గణేశమూర్తిని ఎమ్‌డీఎమ్‌కే నేత దురై వైకో పరామర్శించారు.కాగా, 2019 లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే కూటమిలో ఎండీఎంకేకు ఈరోడ్ స్థానం కేటాయించారు. దీంతో ఎండీఎంకే పార్టీ తరపున గణేశమూర్తి బరిలోకి దిగి గెలుపొందారు. ప్రస్తుత ఎన్నికల్లో ఎండీఎంకేకు తిరుచ్చి లోక్‌సభ స్థానం కేటాయించారు. అక్కడ దురైవైగోను అభ్యర్థిగా ప్రకటించారు. ఈ ఎన్నికల్లో గణేశమూర్తికి అవకాశం ఇవ్వలేదు. దీంతో వారం రోజుల నుంచి తీవ్ర మనోవేదనకు గురైన ఆయన ఆదివారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం.

# ప్రజాశాంతి పార్టీ తెలంగాణ అధ్యక్షుడిగా బాబూ మోహన్



హైదరాబాద్ మార్చ్ 26 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); : ప్రజాశాంతి పార్టీ తెలంగాణ అధ్యక్షుడిగా ప్రముఖ సినీ నటుడు, మాజీ మంత్రి బాబూ మోహన్‌ను ఆ పార్టీ అధినేత కేఏ పాల్ నియమించారు. కాగా, బాబూ మోహన్ కొద్ది రోజుల క్రితమే ప్రజా శాంతి పార్టీలో చేరారు. ఆ పార్టీ పెద్దల వైఖరిపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. బీజేపీ పార్టీ తనని తీవ్ర నిర్లక్ష్యానికి గురిచేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కూడా బాబూ మోహన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. చివరకు ఆయనకు అందోల్ నుంచి బీజేపీ టికెట్ ఇచ్చింది. ఆ నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన దామోదర రాజనరసింహ గెలిచారు. బీఆర్ఎస్ నుంచి చంటి క్రాంతి కిరణ్ రెండో స్థానంలో నిలువగా బాబూ మోహన్ మూడో స్థానానికే పరిమితమయ్యారు. అయితే పార్లమెంట్ ఎన్నికల్లో ఆయన వరంగల్ నుంచి పోటీ చేసే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

# కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో తీవ్ర విషాదం

**- హోలీ ఆడి నదిలో స్నానికి వెళ్లి నలుగురు యువకులు గల్లంటు**

కుమ్రంభీం అసిఫాబద్ మార్చ్ 26 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: పండుగపూట కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో తీవ్ర విషాదం నెలకొంది.

నదిలో స్నానికి వెళ్లి గల్లంతయిన యువకుల కథ విషాదంగా ముగిసింది. నలుగురు యువకులు నీట మునిగి చనిపోయారు జాలర్లు మృతదేహాలను వెలికి తీశారు.వివరాల్లోకి వెళ్తే..జిల్లాలోని కౌటాల మండలం నదిమాబాద్ గ్రామానికి చెందిన సంతోష్, ప్రవీణ్ సాయి, కమలాకర్ అనే నలుగురు యువకులు హోలీ ఆడిన అనంతరం కౌటాల మండలం తాటిపల్లి వద్ద వార్ధా నదిలో స్నానానికి వెళ్లి గల్లంతయ్యారు.గమనించిన స్థానికులు గాలింపు చర్యలు చేపట్టినప్పటికి ఫలితం లేకపోయింది. నలుగురు నీటిలో మునిగి మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాలను కౌటాల దవాఖానకు తరలించారు. పండుగ పూట ఒకే సారి నలుగురు స్నేహితులు మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

# సచివాలయం సాక్షిగా ప్రభుత్వ సలహాదారు చంద్రశేఖర్ రెడ్డి బరితెగింపు వ్యాఖ్యలు

అమరావతి మార్చ్ 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: సచివాలయం సాక్షిగా ప్రభుత్వ సలహాదారు చంద్రశేఖర్ రెడ్డి బరితెగింపు వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల కోడ్ ఉండగానే జగన్ సర్కార్ ఉద్యోగులు అందరూ అండగా నిలవాలంటూ పిలుపునిచ్చారు. ఉద్యోగులంతా పనిగట్టుకుని సామాన్య ప్రజలకు చెప్పి మరీ ఓటేయించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సచివాలయం 5వ బ్లాక్ లో రాష్ట్రప్రధాన అధికారి కార్యాలయానికి ఎదురుగా ఉన్న బిల్డింగ్‌లో మీడియా సమావేశం పెట్టి మరీ జగన్ సర్కార్ కు వత్తాసు పలికారు. విపక్ష పార్టీలు ఉద్యోగుల మీద అభాండాలు వేస్తున్నాయంటూ అక్కసు చంద్రశేఖర్ రెడ్డి ప్రదర్శించారు.

ఉద్యోగులు ప్రభుత్వంలో ఓ భాగం అంటూనే వారంతా ఈ ప్రభుత్వానికి పట్టం కట్టాలంటూ వ్యాఖ్యానించారు. ప్రభుత్వంలో ఉన్న ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారులు ఏదైనా చెబితే దాన్ని ఇంప్లిమెంట్ చేయడం ఉద్యోగుల బాధ్యత అని చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. రాష్ట్రాన్ని బాగువరచాలని ఇప్పడు ఉన్న ముఖ్యమంత్రి జగన్ వలంటీర్, గ్రామ సచివాలయ వ్యవస్థను తెచ్చారంటూ చంద్రశేఖర్ రెడ్డి స్వామిభక్తి ప్రదర్శించారు. ప్రతిపక్ష పార్టీలు దీన్ని జీర్ణించుకోలేకపోతున్నాయని పేర్కొన్నారు. ఈ వ్యవస్థలను, ప్రభుత్వాన్ని ఏదో రకంగా తప్పుబట్టడం ఫ్యాషన్ అయిపోయిందని చంద్రశేఖర్ రెడ్డి వ్యాఖ్యానించారు. తెలుగుదేశం, జనసేన అధినేత పవన్ కల్యాణ్, కాంగ్రెస్‌లో ఓ ఎమ్మెల్యేగా నిలుచునే ఓ వ్యక్తి వలంటీర్ వ్యవస్థనే తప్పుపడుతున్నారంటూ వారిపై నోరు పారేసుకున్నారు.

టీడీపీ కి సంబంధించిన శ్రీకాళహస్తి అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి వలంటీర్ వ్యవస్థను టెరరిస్టులు అని కించవరిచే విధంగా మాట్లాడుతున్నాడని చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రతిపక్షాలు చెప్పినట్టు పోలీసులు ఎందుకు ఫాలో అవుతారంటూ వ్యాఖ్యానించారు. ఏ వ్యక్తి కోసమో పార్టీకోసమే చెప్పినట్టు నడుచుకోవడం కుదరదు అంటూనే అధికార పార్టీ వల్లకి మోశారు. పార్టీలు వస్తూ ఉంటాయి పోతూ ఉంటాయని.. మమ్మల్ని బెదిరిస్తారా? అంటూ బింకాలు పోయారు. నోరు అదుపులో పెట్టుకోని ఉద్యోగుల విషయంలో మాట్లాడాలంటూ పరుష వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రభుత్వం ఉద్యోగులకు అండగా ఉంటుందని చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

ఉద్యోగ సంఘ నాయకులు సంతోషంగా ఉంటే విపక్షం చూడలేకపోతోందన్నారు. ప్రభుత్వంతో ఉద్యోగ సంఘాలు మంచిగా ఉంటే తప్పా? అని ప్రశ్నించారు. ఉద్యోగస్థులు అందరూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. చంద్రశేఖర్ రెడ్డి వ్యాఖ్యలపై ఉద్యోగ వర్గాల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఉద్యోగ సంఘ నాయకులు సంతోషంగా ఉంటే సరిపోతుందా అంటూ ఉద్యోగులు వ్యాఖ్యానించారు. చంద్రశేఖర్ రెడ్డి కోడ్ ఉల్లంఘించారని తెలిపారు. ప్రభుత్వానికి ఉద్యోగులు వచ్చే ఎన్నికల్లో అండగా ఉండాలని చెప్పడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై సీఈవోకు విపక్షాలు ఫిర్యాదు చేయనున్నాయి. సీఈవో కార్యాలయం ఎదురుగా ఉన్న బిల్డింగ్ లో మీడియా సమావేశం పెట్టి మరీ ఎన్నికల కోడ్‌కు చంద్రశేఖర్ రెడ్డి పాతరేశారు.

# టీడీపీ ముందు బీజేపీ నాయకత్వం కీలక ప్రతిపాదన

### -ఏపీ అసెంబ్లీ స్థానాల్లో అదనంగా మరో సీటును కేటాయించాలి

విజయవాడ మార్చ్ 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ):: ఏపీలో కేటాయించిన అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థులపై కసరత్తు చేస్తున్న బీజేపీ నాయకత్వం టీడీపీ ముందు కీలక ప్రతిపాదన ఉంచింది. ఏపీ అసెంబ్లీ స్థానాల్లో అదనంగా మరో సీటును కేటాయించాలని బీజేపీ కోరుతోంది. మొత్తం 11 స్థానాల్లో పోటీ చేయనున్నట్టు బీజేపీ పదాధికారుల సమావేశంలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ చెప్పారని తెలుస్తోంది. అయితే అదనంగా కోరుతున్న సీటు ఏదనేది క్లారిటీగా తెలియరాలేదు.రాజంపేట లేదా తంబళ్లపల్లె అసెంబ్లీ స్థానాల్లో ఏదో ఒకటి తమకి కావాలని బీజేపీ పట్టుబడుతోందని తెలుస్తోంది.

అయితే ఉమ్మడి కడప జిల్లాలో మూడు స్థానాలు ఇవ్వడం కష్టమని టీడీపీ చెబుతోంది. సోము వీర్రాజు కోసం రాజమండ్రి సిటీ లేదా రూరల్ సీటుపై బీజేపీ కన్నేసినట్టుగా తెలుస్తోంది.

అనపర్తి స్థానానికి బదులుగా రాజమండ్రి సిటీ లేదా రూరల్ ఏదో ఒకటి ఇవ్వాలని బీజేపీ కోరుతున్నట్టుగా వార్తలు వస్తున్నాయి. అయితే ఈ రెండూ సిట్టింగ్ స్థానాలే కావడంతో కేటాయించేందుకు టీడీపీ ససేమిరా అంటున్నట్టు సమాచారం. ఈ సీట్ల విషయంపై క్లారిటీ కోసం టీడీపీతో బీజేపీ సంప్రదింపులు జరుపుతున్నట్టుగా తెలుస్తోంది.

# నైతిక ఓటింగ్ పై 5 కే రన్.. జెండా ఊపి ప్రారంభించిన కలెక్టర్ హరిచందన



నల్గొండ, మార్చి 26: ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్యం మనదే అని, కుల, మత, లింగభేదం తేడా లేకుండా రాజ్యాంగం అందరికీ సమానంగా ఓటు హక్కును కల్పించిందని జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన అన్నారు. ఓటు అనే ఆయుధం ద్వారా మంచి నాయకున్ని ఎన్నుకుంటే భవిష్యత్తు బాగుంటుందన్నారు. పలాన వారికి వేయాలని ఎవరో చెప్తే మీరు ఓటు వేయొద్దని, మీ ఆత్మ సాక్షిగా నైతిక ఓటు వేయాలని ఆమె పిలుపునిచ్చారు.మంగళవారం ఆమె ఓటరు అవగాహన కార్యక్రమంలో భాగంగా నల్లగొండ పట్టణంలో నైతిక ఓటింగ్ పై నాగార్జున కళాశాల మైదానం నుంచి స్థానిక గడియారం సెంటర్ వరకు నిర్వహించిన 5 కే రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆమె స్థానిక గడియారం సెంటర్లో మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం ఈ ఎన్నికలలో 85 సంవత్సరాలు నిండిన ఓటర్లకు, దివ్యాంగ ఓటర్లకు హోమ్ ఓటింగ్ సదుపాయం కల్పించిందని తెలిపారు. హోమ్ ఓటింగ్ వేయాలనుకునే ఓటర్లు ఫామ్- 12 డి ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, లేదా సాక్ష్యం యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రాములు నాయక్, జెడ్పీ సీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి, డిఆర్డిఏ పిడి నాగిరెడ్డి, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు డాక్టర్ పుల్లారావు పాల్గొన్నారు.

# క్రీడా పోటీల్లో విద్యార్థులు రాణించాలి- అదనపు కలెక్టర్



కరీంనగర్, మార్చి 26: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో సైతం రాణించాలని పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ అన్నారు. మంగళవారం రామగుండంలోని ఎం.జి. స్టేడియం లో ఎన్టిపిసి సిఎస్ఆర్ సి.డి ఆధ్వర్యంలో జిల్లా ప్రజా పరిషత్ విద్యార్థినీ, విద్యార్థులకు ఏర్పాటు చేసిన గ్రామీణ ఆటల పోటీలను ఎన్.టి.పి.సి (ఆర్డటి) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండుతో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ? క్రీడలపై ఆసక్తి ఉన్నవారిని ప్రోత్సహించడం వలన అద్భుతమైన ప్రతిభ ప్రదర్శిస్తూ విజయం సాధించే అవకాశం ఉంటుందన్నారు. విద్యతో పాటు క్రీడలపై సైతం విద్యార్థులు శ్రద్ధ వహించాలని, ప్రతిరోజూ కొంత సమయం క్రీడలకు కేటాయిస్తే మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. విద్యార్థుల క్రీడాభివృద్ధికి జిల్లా యంత్రాంగం అవసరమైన అన్ని రకాల సహాయ, సహకారాలు అందిస్తూ అండగా ఉంటుందన్నారు. ఎన్.టి.పి.సి సి.ఎస్.ఆర్ క్రింద అనేక కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేస్తుందన్నారు. క్రీడా పోటీల్లో పాల్గొనే విద్యార్థినీ, విద్యార్థులకు ట్రాక్ సూట్స్, భోజన సదుపాయం కల్పించడం జరిగిందన్నారు.

ఎన్.టి.పి.సి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండు మాట్లాడుతూ? ఎన్టిపిసి సిఎస్ఆర్ ద్వారా ఈ ప్రాంత అభివృద్ధికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందని, ముఖ్యంగా విద్య, వైద్యం, ప్రాథమిక సౌకర్యాల కల్పన, ఒకేషనల్ ట్రైనింగ్, కళలు, నీరు, శానిటేషన్ పై కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుందన్నారు. గ్రామీణ క్రీడా పోటీల్లో 20పాఠశాలల నుంచి సుమారు 800 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొంటున్నారని, నిరంతరం వివిధ క్రీడా పోటీల్లో పాల్గొనడం వల్ల విద్యార్థులు ఉత్సాహవంతంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో రామగుండం తహసీల్దార్ కుమార స్వామి, రామగుండం మండల విద్యాశాఖ అధికారి సంపత్ రావు, ఎన్టిపిసి జనరల్ మేనేజర్ ప్రశాంత్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

# ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో రాష్ట్రాలను అప్రమత్తం చేసిన కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ, ఎన్‌డిఎంఏ

న్యూఢిల్లీ, మార్చి 26:వేసవి నెలల్లో ఉష్ణోగ్రతలు పెరిగేకొద్దీ, ఆసుపత్రుల్లో అగ్నిప్రమాదాలు గణనీయమైన ముప్పుగా పరిణమిస్తాయి. దీనిని నివారించడానికి, కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ, నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఎన్ డి ఎం ఏ) అన్ని రాష్ట్రాలు/యుటిలకు ఉమ్మడి సలహాను జారీ చేశాయి, ఇటువంటి విధ్వంసకర సంఘటనలను నివారించడంలో ముఖ్యమైన క్రియాశీల చర్యల గురించి పేర్కొన్నాయి.

రాష్ట్ర ఆరోగ్య విభాగాలు, రాష్ట్ర విపత్తు నిర్వహణ అధికారులు తమ అధికార పరిధిలోని అన్ని గుర్తింపు పొందిన ఆసుపత్రులు విషయంలో తక్షణ చర్యలు తీసుకునేలా చూడటానికి సహకారంతో పనిచేయాలని ఆదేశించారు:

అగ్ని మాపక సమ్మతిని అంచనా వేయడానికి అన్ని ఆసుపత్రులలో సమగ్ర ఫైర్ సేఫ్టీ ఆడిట్ / ఆన్-సైట్ తనిఖీలను నిర్వహించాలి. అగ్నిమాపక వ్యవస్థలు, అగ్ని అలారాలు, అగ్ని పొగ డిటెక్టర్లు, అగ్నిమాపక ఎక్స్టింగ్విషర్లు, ఫైర్ హైడ్రెంట్‌లు, ఫైర్ లిఫ్టులు ఉన్నాయ, పూర్తిగా పనిచేసేలా ఉన్నాయ అని నిర్ధారించుకోవాలి.

ఎలక్ట్రికల్ లోడ్ ఆడిట్లు: తగినంత విద్యుత్ లోడ్ సామర్థ్యంలో క్లిష్టమైన సమస్యను పరిష్కరించాలి. ఆసుపత్రులు తప్పనిసరిగా ఎలక్ట్రికల్ లోడ్ ఆడిట్‌లను ప్రత్యేకించి కొత్త పరికరాలను జోడించేటప్పుడు లేదా ఖాళీలను ఐసీయూ లుగా మార్చేట ప్పుడు. నిర్వహించాలి, గుర్తించిన వైరుధ్యాలు ఏవైనా ఉంటే వెంటనే సరిదిద్దాలి.

అగ్నిమాపక ఎన్‌ఓసి వర్తింపు: ఆసుపత్రులు తప్పనిసరిగా నియంత్రణ అవసరాలకు కట్టుబడి ఉండాలి. వాటి సంబంధిత రాష్ట్ర అగ్నిమాపక విభాగాల నుండి చెల్లుబాటు అయ్యే ఫైర్ నో-అబ్జెక్షన్ సర్టిఫికేట్‌లను (ఎన్‌ఓసిలు) పొందాలి. అగ్నిమాపక భద్రతా నిబంధనలను అవలంబించే ముందు నిర్మించిన పాత భవనాలలో విద్యుత్ లోడ్లను తిరిగి క్రమాంకనం చేయడానికి ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది.

అగ్నిమాపక భద్రత సమ్మతిని నిర్ధారించడానికి ఆసుపత్రులు చేపట్టాల్సిన దశలు, చర్యలను వివరించే వివరణాత్మక సూచనలను అన్ని రాష్ట్రాలు, యుటిల ప్రధాన కార్యదర్శులకు పంపడం జరిగింది. అన్ని గుర్తింపు పొందిన ఆసుపత్రులలో సమాచారాన్ని విస్తృతంగా అందివ్వాలని సిఫార్సు చేశారు.

ఆసుపత్రులు, ఇతర ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలలో అగ్ని ప్రమాదాలు సంభవించకుండా నిరోధించడానికి అనుసరించాల్సిన సూచనలు క్రింది విధంగా ఉన్నాయి:

ఫంక్షనల్ ఫైర్ ఫైటింగ్ సిస్టమ్స్: ఆసుపత్రులు తప్పనిసరిగా అగ్నిమాపక పరికరాలు, హైడ్రెంట్లు, అలారాలు వంటి అగ్నిమాపక పరికరాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలి. ఆర్పివేసే యంత్రాల గడువు తేదీలను తనిఖీ చేయడం, హైడ్రెంట్‌లు అందుబాటులో ఉన్నాయా లేదా చూడడం , తగిన నీటి ఒత్తిడిని కలిగి ఉండేలా చూసుకోవడం ముఖ్యం. ఫైర్ అలారంలు సదుపాయం అంతటా పనిచేస్తాయి మరియు వినగలిగేలా చేయడం వంటివి ఇందులో ఉన్నాయి. ఫంక్షనల్ ఫైర్ ఫైటింగ్ సిస్టమ్స్: ఆసుపత్రులు తప్పనిసరిగా అగ్నిమాపక పరికరాలు, హైడ్రెంట్లు మరియు అలారాలు వంటి అగ్నిమాపక పరికరాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలి. ఆర్పివేసే యంత్రాల గడువు తేదీలను తనిఖీ చేయడం, హైడ్రెంట్‌లు అందుబాటులో ఉన్నాయని మరియు తగిన నీటి ఒత్తిడిని కలిగి ఉండేలా చూసుకోవడం మరియు ఫైర్ అలారంలు సదుపాయం అంతటా పనిచేస్తాయి మరియు వినగలిగేలా చేయడం వంటివి ఇందులో ఉన్నాయి.

రెగ్యులర్ మెయింటెనెన్స్ మరియు టెస్టింగ్: అన్ని భద్రతా పరికరాల కోసం నిర్వహణ షెడ్యూల్‌ను ఏర్పాటు చేయండి. ఇందులో అగ్నిమాపక యంత్రాల యొక్క నెలవారీ తనిఖీలు, ఫైర్ అలారంలు మరియు హైడ్రెంట్‌ల యొక్క త్రైమాసిక పరీక్షలు మరియు సంబంధిత భారతీయ ప్రమాణాలకు అనుగుణంగా వాటి ప్రభావాన్ని ధృవీకరించడానికి వార్షిక వృత్తిపరమైన తనిఖీలు ఉండాలి.

రెగ్యులర్ ఎలక్ట్రికల్ లోడ్ ఆడిట్‌లు: ఆసుపత్రి విద్యుత్ వినియోగాన్ని అంచనా వేయడానికి, ముఖ్యంగా ఐసీయూల వంటి అధిక డిమాండ్ ఉన్న ప్రాంతాలలో ద్వై-వార్షిక ఎలక్ట్రికల్ ఆడిట్‌లను నిర్వహించాలి. నేషనల్ ఎలక్ట్రికల్ కోడ్ ఆఫ్ ఇండియా-2023 ప్రకారం సిస్టమ్‌ను ఓవర్‌లోడ్ చేయకుండా భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా అప్‌గ్రేడ్‌లు లేదా సవరణలు ధృవీకరించిన ఎలక్ట్రీషియన్ ద్వారా అంచనా వేయబడాలి.రెగ్యులర్ మెయింటెనెన్స్ మరియు టెస్టింగ్: అన్ని భద్రతా పరికరాల కోసం నిర్వహణ షెడ్యూల్‌ను ఏర్పాటు చేయాలి. ఇందులో అగ్నిమాపక యంత్రాల నెలవారీ తనిఖీలు, ఫైర్ అలారంలు, హైడ్రెంట్‌ల త్రైమాసిక పరీక్షలు, సంబంధిత భారతీయ ప్రమాణాలకు అనుగుణంగా వాటి ప్రభావాన్ని ధృవీకరించడానికి వార్షిక వృత్తిపరమైన తనిఖీలు ఉండాలి.

రెగ్యులర్ ఎలక్ట్రికల్ లోడ్ ఆడిట్‌లు: ఆసుపత్రి విద్యుత్ వినియోగాన్ని అంచనా వేయడానికి, ముఖ్యంగా ఐసీయూల వంటి అధిక డిమాండ్ ఉన్న ప్రాంతాలలో ద్వై-వార్షిక ఎలక్ట్రికల్ ఆడిట్‌లను నిర్వహించాలి. నేషనల్ ఎలక్ట్రికల్ కోడ్ ఆఫ్ ఇండియా-2023 ప్రకారం సిస్టమ్‌ను ఓవర్‌లోడ్ చేయకుండా భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా అప్‌గ్రేడ్‌లు లేదా సవరణలు ధృవీకరించబడిన ఎలక్ట్రీషియన్ ద్వారా అంచనా వేయాలి.

ఆక్సిజన్ భద్రత: ఆక్సిజన్ ట్యాంక్‌లు, పైప్డ్ ఆక్సిజన్ ఉన్న ప్రాంతాల్లో, హీట్ సోర్స్‌లపై కఠినమైన నో-స్మోకింగ్ విధానాలు, నియంత్రణలను అమలు చేయాలి. సంకేతాలు ఈ ప్రాంతాలను స్పష్టంగా గుర్తించాలి, అధిక-ఆక్సిజన్ పరిసరాలతో సంబంధం ఉన్న ప్రమాదాలపై సిబ్బందికి శిక్షణ ఇవ్వాలి.

,స్మోక్ డిటెక్టర్లు మరియు ఫైర్ అలారమ్‌ల ఇన్‌స్టాలేషన్: ఫైర్ స్మోక్ డిటెక్టర్లు, ఫైర్ అలారంలు అన్ని హాస్పిటల్ ఏరియాలలో, ముఖ్యంగా పేషెంట్ రూమ్‌లు, హాలులు, సాధారణ ప్రాంతాలలో అమర్చబడి ఉన్నాయని నిర్ధారించుకోండి. ఐఎస్ 2189లో నిర్దేశించినట్లుగా ఈ సిస్టమ్‌లను నెలవారీగా పరీక్షించాలి. బ్యాటరీలను ఏటా లేదా అవసరమైన విధంగా భర్తీ చేయాలి.

మంటలు సులభంగా అంటుకునే మెటీరియల్ నియంత్రణ: ఆసుపత్రి నిర్మాణం, గృహోపకరణాలలో ఉపయోగించే ఆడిట్ మెటీరియల్స్ మండే పదార్థాలను గుర్తించడానికి, భర్తీ చేయడానికి మండే లేదా అగ్ని-నిరోధక ప్రత్యామ్నాయాలు, ప్రత్యేకించి ఇన్-పేషెంట్ కేర్ ప్రాంతాలు

ఎలక్ట్రికల్ డక్ట్‌ల కోసం మండించలేని మెటీరియల్: ఎలక్ట్రికల్ డక్ట్‌లను తనిఖీ చేయాలి, అవి ఓపెనింగ్‌ల ద్వారా మంటలు, పొగ వ్యాప్తి చెందకుండా నిరోధించే ఇంట్యూమెసెంట్ ఫైర్‌స్టాప్ సీలాంట్లు వంటి పదార్థాలతో సీలు చేయబడి ఉన్నాయని నిర్ధారించుకోవాలి.ఓవర్‌లోడింగ్ పవర్ సోర్స్‌లను నివారించండి: ఎలక్ట్రికల్ లోడ్‌లను పర్యవేక్షించడానికి, ఓవర్‌లోడింగ్ నిరోధించడానికి పవర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లను ఉపయోగించాలి. బహుళ అధిక-శక్తి పరికరాలు ఒకే సర్క్యూట్‌కు కనెక్ట్ చేయబడలేదని నిర్ధారించుకోవాలి. కొత్త పరికరాలను సురక్షితంగా ఉంచడానికి విద్యుత్ పంపిణీని క్రమం తప్పకుండా సమీక్షించండి.

వాటర్ స్ప్రింక్లర్లు మరియు హోస్‌పైపల ఇన్‌స్టాలేషన్: ఆటోమేటిక్ స్ప్రింక్లర్ సిస్టమ్‌లు, యాక్సెస్ చేయగల హోస్‌పైపలతో ఐసీయూలు, ఆపరేషన్ థియేటర్‌లతో సహా క్లిష్టమైన ప్రాంతాలను అమర్చండి. ఈ సిస్టమ్‌లు అగ్నిప్రమాదం సంభవించినప్పుడు సక్రియం చేయడానికి ఫైర్ అలారం సిస్టమ్‌తో సమకాలీకరించి ఉండాలి.

నేషనల్ బిల్డింగ్ కోడ్‌కు ఖచ్చితంగా కట్టుబడి ఉండటం: నేషనల్ బిల్డింగ్ కోడ్ 2016లో పేర్కొన్న తాజా అగ్నిమాపక భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఆసుపత్రి మౌలిక సదుపాయాలను క్రమం తప్పకుండా సమీక్షించాలి, అప్ డేట్ చేయాలి. ఇందులో సరైన వెంటిలేషన్ సిస్టమ్‌లు, ఫైర్-రెసిస్టెంట్ డోర్లు, కారిడార్‌లు, మెట్ల బావుల్లో ఎమర్జెన్సీ లైటింగ్ ఉండేలా చూసుకోవాలి.సిబ్బంది శిక్షణ, కసరత్తులు: అగ్నిమాపక నివారణ, అత్యవసర విధానాలు, అగ్నిమాపక పరికరాల వినియోగంపై సిబ్బంది అందరికీ నిరంతర శిక్షణా కార్యక్రమాన్ని అమలు చేయాలి.

# ఏప్రిల్ 8 నుంచి 17 వరకు హాలిడేస్!

### -ఏప్రిల్ 20వ తేది నుంచే సమ్మర్ హాలిడేస్
### -జూన్ 13నుంచి కొత్త అకాడమిక్ ఇయర్ ప్రారంభం
### -ఈసారి వేసవి సెలవులు ఏకంగా 50 రోజులు
### -వార్షిక పరీక్షలు త్వరగా పూర్తి చేయాలని ఆదేశాలు

అమరావతి, మార్చి 26:ఏపీ, తెలంగాణాలలోని పాఠశాలల్లో ఒంటి పూట బడులు కొనసాగుతున్నాయి. అలాగే ఎండలు విపరీతంగా ఉన్న సందర్భంగా ఈసారి వేసవి సెలవులు కూడా తొందరగా వచ్చే అవకాశాలున్నాయి. ఏప్రిల్ నెలలో పాఠశాలలు, కాలేజీలకు వరుస సెలవులు రానున్నాయి. ఉగాది, రంజాన్, శ్రీరామనవమి సందర్భంగా వారం రోజుల్లో వరుసగా 4 రోజులు సెలవులు ఉండబోతున్నాయి. వీటితో పాటు.. రెండో శనివారం, ఆదివారం కూడా ఉండటంతో.. ఏప్రిల్ 8 నుంచి ఏప్రిల్ 17 వరకు వరుసగా స్కూళ్లకు సెలవులు రానున్నాయి. అలాగే కాలేజీలకు కూడా సెలవులు ఇవ్వనున్నారు.

వేసవి సెలవులు కూడా.. ఏప్రిల్ 18 లేదా ఏప్రిల్ 20 నుంచి ఇవ్వనున్నట్లు సమాచారం. దాదాపు స్కూల్స్‌కి 50 రోజులు పాటు ఈ సారి సెలవులు ఉండే అవకాశం ఉంది. గత ఏడాది కంటే ఈ సారి వేసవి సెలవులు ఎక్కువగా ఇచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వార్షిక పరీక్షలను త్వరగా పూర్తి చేయాలని విద్యా శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇక జూన్ 13న కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది.

# ఉపాధి కోల్పోయిన కార్మికులకు.. తక్షణ సాయంగా రూ.10 వేలు అందించాలి..



కరీంనగర్, మార్చి 26: సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న ఉపాధి సమస్యలను పరిష్కరిస్తూ మూడు నెలలుగా ఉపాధి కోల్పోయిన కార్మికులకు తక్షణ సాయంగా రూ.10 వేల ఆర్థిక సాయం అందించాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంగళవారం వినతిపత్రం రాస్తూ సంతకాల సేకరణ ప్రారంభించారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సంక్షోభం వలన గత మూడు నెలల నుండి ఉపాధి కోల్పోయి ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ అప్పులు చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్న పవర్ లూమ్, అనుబంధ రంగాల కార్మికులందరికీ ప్రభుత్వం తక్షణ సాయంగా రూ. 10వేలు అందించి ఆదుకోవాలని, అలాగే పవర్లూమ్ కార్మికులకు రావలసిన బతుకమ్మ చీరల పెండింగ్ 10శాతం సబ్సిడీని వెంటనే అందించాలని, వస్త్ర పరిశ్రమ లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి వెంటనే అందరికీ ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని మంగళవారం సిఐటియు పవర్లూమ్ వర్కర్స్ యూనియన్, అనుబంధ రంగాల వార్పిన్, వైపని యూనియన్ కమిటీల ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి వినతి పత్రం రాసి కార్మికుల సంతకాల సేకరణ కార్యక్రమాలను చేపట్టారు.

అనంతరం కార్మికులందరితో సిరిసిల్ల పాలిస్టర్ వస్త్ర ఉత్పత్తిదారుల సంఘం వద్దకు వెళ్లి వస్త్ర పరిశ్రమ యజమానులను కలిసి నెలల తరబడి పరిశ్రమలను బందు పెట్టడం వలన కార్మికులు పనిలేక ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే పని ప్రారంభించాలని, లేనిపక్షంలో కార్మికులందరికీ ఖర్చుల నిమిత్తం ప్రతి కార్మికునికి వారానికి రూ.10వేల చొప్పున అందించాలని లేఖను అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు తెలంగాణ పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మూషం రమేష్ మాట్లాడుతూ సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమ సంక్షోభం వలన యజమానులు పరిశ్రమలను బందు పెట్టడం మూలంగా వస్త్ర పరిశ్రమపై ఆధారపడి పనిచేస్తున్న వేలాదిమంది పవర్లూమ్, అనుబంధ రంగాల కార్మికులు, ఆసాములు గత మూడు నెలల నుండి పనిలేక అప్పులు చేస్తూ కుటుంబాలను పోషించుకుంటూ ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నారని, పరిశ్రమలు నెలకొన్న సమస్యలను పరిష్కరించి అందరికీ కల్పించాలని సిఐటియు ఆధ్వర్యంలో అధికారులకు, ప్రభుత్వం, ప్రజా ప్రతినిధుల దృష్టికి అనేకసార్లు తీసుకెళ్లిన కూడా సమస్యను పరిష్కరించడం లేదన్నారు.

ఒకవైపు కార్మికులకు చేద్దామంటే పనిలేక మరో వైపు అప్పులు ఇచ్చేవారు కూడా లేక కుటుంబాలు పస్తులు ఉండే పరిస్థితి ఏర్పడి కార్మికులు ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటూ మనస్థాపానికి గురవుతున్నారని, ప్రస్తుత పరిస్థితుల్లో కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందని, ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి వెంటనే స్పందించి ఉపాధి కోల్పోయిన పవర్ లూమ్, అనుబంధ కార్మికులందరికీ తక్షణ సాయంగా రూ.10 వేలు అందించాలని కోరారు. అలాగే పవర్లూమ్ కార్మికులకు రావాల్సిన 10 శాతం యారన్ సబ్సిడీ పెండింగ్ బకాయిలను అందించాలని, అదేవిధంగా వస్త్ర పరిశ్రమంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి అందరికీ ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో రాబోయే పార్లమెంటు ఎన్నికలలో అన్ని పార్టీల నాయకుల ప్రచారాలు, సభలను అడ్డుకుంటామని హెచ్చరించారు.

పవర్ లూమ్ అనుబంధ రంగాల కార్మికులందరూ రేపటి నుండి ఉదయం 9 గంటల వరకు బివై నగర్ లోని షాదీఖానా వెనక గల భద్రావతీ సొసైటీ వద్దకు రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కోడం రమణ, వార్పిన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు సిరిమల్లె సత్యం, వైపని వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కుమ్మరికుంట కిషన్, నాయకులు ఉడుత రవి, నక్క దేవదాస్, గుండు రమేష్, ఆడేపు సంపత్, ఒగ్గు గణేష్, ఎలిగేటి శ్రీనివాస్, మచ్చ వేణు, సబ్బని చంద్రకాంత్, మోర తిరుపతి, బెజుగం సురేష్, గోరంతల రాజమల్లు, వేణు, హరిదాస్, సదానందం, ప్రవీణ్, విజయ్, శ్రీధర్, శ్రీనివాస్, ప్రసాద్, రవీందర్, పోచమల్లు పవర్లూమ్, అనుబంధ రంగాల కార్మికులు పాల్గొన్నారు.

# దేశ రక్షకులతో ఇటువంటి వేడుకలు మన సంస్కృతిలో అంతర్భాగంగా మారాలి

న్యూఢిల్లీ, మార్చి 26:రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ సైనికులతో కలిసి రంగుల పండుగ హోలీని మార్చి 24, 2024న లేహ్‌లో జరుపుకున్నారు. ఆయనతోపాటు ఆర్మీ స్టాఫ్ చీఫ్ జనరల్ మనోజ్ పాండే మరియు జనరల్ ఆఫీసర్ కమాండింగ్, ఫైర్ అండ్ ఫ్యూరీ కార్ప్స్ లెఫ్టినెంట్ జనరల్ రషీమ్ బాలి ఉన్నారు.

సైనికులను ఉద్దేశించి రక్షణ మంత్రి, మాతృభూమిని రక్షించడానికి కఠినమైన భౌగోళిక ప్రాంతాలు మరియు ప్రతికూల వాతావరణ పరిస్థితులలో సేవ చేస్తున్న వారి పరాక్రమం, సంకల్పం మరియు త్యాగాన్ని ప్రశంసించారు. ఎత్తైన ప్రదేశాలలో సైనికుల సానుకూల నిబద్ధత అతి శీతల ఉష్ణోగ్రతల కంటే చాలా బలంగా ఉందని ఆయన అన్నారు. ఢిల్లీ దేశ రాజధాని, ముంబై ఆర్థిక రాజధాని మరియు బెంగళూరు సాంకేతిక రాజధాని అయినట్లే లడఖ్‌ను భారత శౌర్యం మరియు ధైర్య సాహసాల రాజధానిగా పేర్కొన్నారు.

"మన వీర సైనికులు సరిహద్దులను పరిరక్షిస్తున్నందున దేశం మొత్తం సురక్షితంగా ఉంది. మన అప్రమత్తమైన సైనికులు సరిహద్దుల వద్ద సిద్ధంగా నిలబడటంతో మనం అభివృద్ధి చెందుతున్నాము అలాగే సంతోషకరమైన జీవితాన్ని గడుపుతున్నాము. ప్రతి పౌరుడు సాయుధ బలగాలు తమ కుటుంబాలకు దూరంగా జీవిస్తున్నందున మనం హోలీ మరియు ఇతర పండుగలను మన కుటుంబాలతో శాంతియుతంగా జరుపుకుంటున్నాము. దేశం మన సైనికులకు ఎప్పటికీ రుణపడి ఉంటుంది మరియు వారి ధైర్యం మరియు త్యాగాలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిని ఇస్తాయి" అని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.

పండుగలను మొదట దేశ రక్షకులు మరియు వారితో జరుపుకోవాలని తాను నమ్ముతున్నందున, ఒక రోజు ముందు సైనికులతో కలిసి హోలీ జరుపుకోవాలని నిర్ణయించుకున్నట్లు రక్షణ మంత్రి నొక్కిచెప్పారు. ఒకరోజు ముందుగానే సైనికులతో పండుగ వేడుకలను ప్రారంభించే కొత్త సంప్రదాయాన్ని నెలకొల్పాలని త్రివిధ దళాల అధిపతులను ఆయన కోరారు. కార్గిల్‌లోని మంచు శిఖరాల్లో, రాజస్థాన్‌లోని మండుతున్న మైదానాల్లో, లోతైన సముద్రాల్లో ఉన్న జలాంతర్గామిలో సైనికులతో ఇటువంటి వేడుకలు జరుపుకోవడం మన సంస్కృతిలో అంతర్భాగంగా మారాలని ఆయన అన్నారు.

ఈ సందర్భంగా, జాతి సేవలో అత్యున్నత త్యాగం చేసిన ధైర్యవంతులకు గంభీరమైన నివాళిగా శ్రీ రాజ్‌నాథ్ సింగ్ లేహ్‌లోని యుద్ధ స్మారక స్థూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచారు.తరువాత, రక్షణ మంత్రి ప్రపంచంలోని అత్యంత ఎత్తైన యుద్ధభూమి సియాచిన్‌లో పోస్ట్ చేయబడిన సైనికులతో ఫోన్‌లో మాట్లాడి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. త్వరలో సియాచిన్‌ను సందర్శించి వారితో సంభాషిస్తానని చెప్పారు. శ్రీ రాజ్‌నాథ్ సింగ్ సియాచిన్‌ను సందర్శించి అక్కడి సైనికులతో కలిసి హోలీ జరుపుకోవా లని నిర్ణయించుకున్నారు. అయితే ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా కార్యక్రమంలో మార్పు రావడంతో లేహ్‌లో సైనికులతో కలసి రంగుల పండుగ జరుపుకున్నారు.

# న్యాయవాద వృత్తి ఎంతో గొప్పది

### - సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ వై.చంద్రచూడ్

అమరావతి మార్చ్ 26 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: న్యాయవాద వృత్తి ఎంతో గొప్పదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ వై.చంద్రచూడ్ అన్నారు. పురుషులతో సమానంగా మహిళలు కూడా న్యాయవాద వృత్తి ని ఎంచుకుంటుండడం సంతోషించదగ్గ విషయమని పేర్కొన్నారు.తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని శ్రీనివాస ఆడిటోరియంలో జరిగిన ఎస్వీయూ న్యాయశాఖ 10వ వార్షికోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీజే మాట్లాడుతూ నిష్పాక్షిత , నిజాయితీ, సమర్థత వంటి లక్షణాలను చిన్ననాటి నుంచే అలవరుచుకుంటే ఉన్నతస్థానంలోకి రాణించే అవకాశం ఉంటుందని సూచించారు. న్యాయవాదవృత్తి ఎంచుకున్న విద్యార్థులు న్యాయవృత్తిని గౌరవిస్తూ విద్యనభ్యసించాలన్నారు.




# అంతరాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్..




హైదరాబాద్, మార్చి 26:రహదారులకు సమీపంలో ఉన్న ఇండ్లే వారి టార్గెట్.. ఇంటికి తాళం కనిపించిందో ఇక అంతే సంగతి, పగలంతా రెక్కీలు నిర్వహించి రాత్రి వేళల్లో చోరీలకు పాల్పడుతూ, అదేవిధంగా చైన్ స్నాచింగ్ చేస్తూ దొరికిందంతా దోచుకుంటున్న మహారాష్ట్ర గ్యాంగ్ ను ఎట్టకేలకు రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పోలీసులు పట్టుకున్నారు. శంషాబాద్ డిసిపి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో షాద్ నగర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం స్థానిక ఏసీపీ రంగస్వామి పర్యవేక్షణలో మీడియా సమావేశం నిర్వహించారు. మహారాష్ట్ర గ్యాంగ్ చేసిన 23 దొంగతనాలకు సంబంధించిన పలు పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల వివరాలను మీడియా ముందు పెట్టారు.

షాద్ నగర్, ఆమన్ గల్, కడ్తాల్, శంషాబాద్, కొత్తూరు, కేశంపేట, నందిగామ, పహాడి షరీఫ్, మహేశ్వరం, కందుకూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగతనాలకు పాల్పడిన నిందితులు మహారాష్ట్రలోని ఔరంగాబాద్ జిల్లా వైజాపూర్ గ్రామానికి చెందిన ప్రధాన నిందితుడు రాజీవ్ శంకర్ పవర్, అదేవిధంగా నాగపూర్ కు చెందిన అజయ్ సర్కస్ పవర్, తుల్జాపూర్ గ్రామానికి చెందిన అమూల్ అలియాస్ షిండే, అలాగే మహారాష్ట్రలోని వైజపూర్ తాలూకా గొల్వడి గ్రామానికి చెందిన పవన్ మచీంద్ర, నాగపూర్ గ్రామానికి చెందిన ఎల్వాతిలు అంతరాష్ట్ర దొంగల ముఠాగా ఏర్పడి 23 చోరీలకు పాల్పడ్డారు. రంగారెడ్డి జిల్లాలోని షాద్ నగర్, ఆమన్ గల్, కడ్తాల్, శంషాబాద్, కొత్తూరు, కేశంపేట, నందిగామ, పహాడి షరీఫ్, మహేశ్వరం, కందుకూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగతనాలకు పాల్పడగా పోలీసులు ఆయా పోలీస్ స్టేషన్ లో కేసులు నమోదు చేశారు.

షాద్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఐదు దొంగతనాలు చేయగా, కొత్తూరులో ఒకటి, కడ్తాల్ మండలంలో రెండు, మహేశ్వరం మండలంలో రెండు, కందుకూర్ మండలంలో రెండు, నందిగామ మండలంలో ఒకటి, కేశంపేట పరిధిలో ఒకటి, శంషాబాద్ పరిధిలో మూడు, ఆమన్గల్ పరిధిలో నాలుగు దొంగతనాలు చేశారని శంషాబాద్ డిసిపి నారాయణరెడ్డి కేసులతో సహ మీడియా ముందు వివరించారు. వీరిపై ఆయా పోలీస్ స్టేషన్లలో 23 కేసులు నమోదై ఉన్నాయని వివరించారు. ఇందులో ఇద్దరిని ఈనెల 14న సాంకేతిక సాక్షాదారాలతో సహా అదుపులోకి తీసుకున్నట్టు డీసీపీ వివరించారు. రాజీవ్ శంకర్ పవర్, పవన్ మచ్చింద్ర ఇద్దరిని అదుపులోకి తీసుకొని 30 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. 23 కేసుల్లో బాధితులకు వారికి సంబంధించిన బంగారు ఆభరణాలను కోర్టు ద్వారా అందజేస్తామని డిసిపి వివరించారు.

# కిడ్నీ మార్పిడికి వెస్సో ట్రస్ట్ ఆర్థిక సహాయం

న్యూఢిల్లీ, మార్చి 26:కిడ్నీ మార్పిడికి వెస్సో ట్రస్ట్ ఆర్థిక సహాయం అందిబంచి తన దాతృత్వాన్ని చాటుకుంది. విజయవాడ నివాసి మొగులూరి లక్ష్మీకాంత రావు(48) ఒక చిరుద్యోగి. మార్కెటింగ్ ఎక్జిక్యూటివ్ గా అనేక కంపెనీలలో పని చేశారు. వారికి భార్య, కాలేజీలో చదువుతున్న ఇద్దరు అబ్బాయిలు ఉన్నారు. ఆయన గత పది సంవత్సరాలుగా సుగర్ వ్యాధితో బాధ పడుతున్నారు. వృత్తిపరమైన వత్తిడి కారణంగా షుగర్ వ్యాధి ముదిరి, క్రానిక్ కిడ్నీ డిసీజ్ తో రెండు కిడ్నీలు పూర్తిగా దెబ్బ తిన్నవి. ఒక కిడ్నీ అయినా తొందరగా మార్పిడి చేసుకోమని వైద్యుల సూచించారు. విషయం తెలిసి దగ్గర బంధువు ఒకరు కిడ్నీ దానం చేయటానికి ముందుకు వచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆరోగ్యశ్రీ లో వారానికి రెండు సార్లు డయాలసిస్ చేయించుకుంటున్నారు. చికిత్స నిమిత్తం మందులకు, ప్రయాణ ఖర్చులకు చాలా ఇబ్బంది పడుతున్న పరిస్థితి! ఇప్పుడు కిడ్నీ మార్పిడికి సుమారు 9 లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని అంచనా! ప్రభుత్వ సహాయం ఎంత వరకు అందుతుందనే విషయంపై పూర్తి స్పష్టత లేదు. కిడ్నీ మార్పిడికి ఆర్థిక సహాయం చేయమని వెస్సోను ఆశ్రయించారు. మిగిలిన మొత్తం కొరకు బంధుమిత్రుల సహకారంతో ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. వెస్సో గౌరవ దాతల సహకారం తో ఆయనకు 35,000/-ల రూపాయలు అందజేసింది. ఈ సందర్భంగా వెస్సో ట్రస్ట్ అధ్యక్షులు బంగారు తాతారావు మాట్లాడుతూ తీవ్ర అనారోగ్యంతో ఉపాధి కోల్పోయి జీవన్మరణ పోరాటం చేస్తున్న లక్ష్మీకాంతరావు సహాయం చేసిన గౌరవ దాతలకు ధన్యవాదములు తెలిపారు.

# డి సి సి బి చైర్మన్‌గా కుంట రమేష్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నిక..



నిజామాబాద్, మార్చి 26: రైతు సంక్షేమమే ధ్యేయంగా పాటుపడతానని, బ్యాంకు ని లాభాల బాటలో తీసుకురా వడానికి కృషి చేస్తానని డిసిసిబి బ్యాంక్ చైర్మన్ కుంట రమేష్ రెడ్డి అన్నారు. ఉమ్మడి జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ గా కుంట రమేష్ రెడ్డి నేడు పదవీ బాధ్యతలు చేపట్టారు. డిసీసీబి బ్యాం కులో చైర్మన్ ఎన్నికపై పాలక వర్గ సమావేశం నిర్వహించారు. చైర్మన్ ఎన్నిక కోసం ఒకే ఒక నామినేషన్ దాఖలు కావడంతో చైర్మన్గా కుంట రమేష్ రెడ్డిని ఏకగ్రీవంగా ప్రకటించారు.

అనంతరం పదవి బాధ్యతలు చేపట్టిన రమేష్ రెడ్డి కి పలువురు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కుంట రమేష్ రెడ్డి మాట్లా డుతూ..తనను ఏకగ్రీవం ఎన్నుకున్నందుకు డైరెక్టర్లకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఇందుకు సహ కరించిన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఏనుగు రవీందర్ రెడ్డి, ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్ బిన్ హంధాన్ లకు కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞత లు తెలిపారు.

జిల్లా రైతన్నలకు తన సహకారం ఉంటుందని, రైతులకు, డైరెక్టర్లకు ఉద్యో గులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని అన్నారు. తనపై నమ్మకంతో ఏకగ్రీవం చేసినందుకు ఎలాంటి అవినీతి అక్రమాలకు పాల్పడకుండా బ్యాంకు అభివృద్ధికి తోడ్పడు తానని అన్నారు. సహచర డైరెక్టర్లకు హృదయ పూర్వక అభినందనలు తెలుపుతు న్నామన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు కుంట రమేష్ రెడ్డి అభిమానులు టపాకాయలు కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

# కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు- బోయినపల్లి వినోద్ కుమార్



హైదరాబాద్, మార్చి 26: ప్రస్తుతం నెలకొన్న కరువు కాలం తెచ్చింది కాదని.. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిందని కరీంనగర్ టీఆర్ఎస్ పార్లమెంటు అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ ఆరోపించారు. మంగళవారం ఇల్లంతకుంట మండలం రహీంఖాన్ పేట గ్రామంలో ఎండిన పంటపొలాలను మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తో కలిసి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రైతు ప్రభుత్వమని చెప్పి రైతులను ఆగం చేస్తుందన్నారు. ఎండిపోయిన పంటలకు రైతులకు ఎకరాకు 25వేల రూపాయల పంట నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రైతులను వోనగించిన కాంగ్రెస్ కు పుట్టగతులుండవని, రైతులు అన్నమో రామచంద్ర అంటున్నా ప్రభుత్వానికి కనికరం లేదన్నారు. ప్రభుత్వం రైతులను ఆదుకోకుంటే ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడతామన్నారు.

రైతులు సచ్చిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, రైతుల బాధలు చూస్తుంటే గుండె తరుక్కుపోతుందన్నారు. యాసంగి పంటలకు సాగునీళ్లు ఇవ్వడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, మేడిగడ్డ వద్ద గోదావరి నదిలో రోజుకు 5000ల క్యూసెక్కుల నీళ్లు వృధాగా పోయి సముద్రంలో కలుస్తున్న కూడా ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో 50టీఎంసీల నీళ్లు సముద్రంలో కలిశాయన్నారు. ఎన్నికలకు ముందు రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం మాయమాటలు చెప్పి అరచేతిలో వైకుంఠం చూపిందన్నారు. మేడిగడ్డ బ్యారేజ్ వద్ద మూడు పిల్లర్లు కుంగితే దానిని సాకుగా చూపించి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టులను ఎండబెట్టి, సాగునీళ్లు ఇవ్వకుండా రైతులను కన్నీరు పెట్టిస్తోందన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే 180మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు క్వింటాలుకు 500 రూపాయల బోనస్ ఇవ్వాలన్నారు. రైతుభరోసా పథకం ద్వారా రైతులకు ఎకరాకు రూ.15000ల సాయం, రూ. 2లక్షల రుణమాఫీ చేయాలన్నారు. రైతులను కన్నీరు పెట్టిస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి పుట్టగతులుండవన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ తుల ఉమ, జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ బిల్లవేని పర్శరాం, మాజీ ఏఎంసీ చైర్మన్ వేణురావు, అనంతగిరి ఎంపీటీసీ పర్శరాం, గుండ ముత్తయ్య, కెవిఎన్ రెడ్డి, గాదె కనకయ్య, బిల్లవేని చంద్రయ్య, కొమ్ము కనకయ్య, ఏనుగుల పర్శరాం, ఏనుగుల బుచ్చిరెడ్డి, కూస నరేష్, బిల్లవేని సాయి, ఆరే కొమురయ్య, జక్కుల నాగరాజు యాదవ్, దూలం సంపత్ గౌడ్, సంతోష్ రెడ్డి, ఆళ్వాల రాజేశం, రమేశ్, ఓంకార్, తదితరులు పాల్గొన్నారు.

# కోదాడ జూనియర్ సివిల్ కోర్టులో అగ్ని ప్రమాదం..

సూర్యాపేట, మార్చి 26:సూర్యాపేట జిల్లా కోదాడలోని జూనియర్ సివిల్ కోర్టులో అగ్ని ప్రమాదం జరిగింది.

షాక్ సర్క్యూట్ తో కోర్టులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ మంటల్లో కోర్టులోని బీరువాల్లోని పలు దస్త్రాలు కాలి బూడిదయ్యాయి.

అయితే అగ్నిప్రమాదం అర్ధరాత్రి జరగడంతో పెను ప్రమాదం తప్పింది. మూడు రోజులు కోర్టుకు సెలవులు కావడంతో సిబ్బంది గమనించలేదు. ఇవాళ తెల్లవారు జామున కోర్టు తెరిచి చూసే సరికి పలు ఫైల్లు దగ్ధమయి ఉండటంతో అగ్ని ప్రమాదం జరిగిందని అంచనా వేశారు.

ఘటన స్థలానికి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి శ్యాంసుందర్, విద్యుత్, పోలీస్ అధికారులతో కలిసి పరిశీలించారు. విచారణ చేసి కోర్టుకి రిపోర్టు సబ్మిట్ చేయాలని విద్యుత్ శాఖకి వినతిపత్రం అందించారు కోర్టు సిబ్బంది.

# 60 రోజుల్లోనే మెగా డీఎస్సీ పై సంతకం : చంద్రబాబు



అమరావతి, మార్చి 26:యువత ఉత్సాహం చూస్తుంటే నాకు మళ్లీ నా పాతరోజోజులు గుర్తొస్తున్నాయని.. విద్యార్థి రాజకీయాల నుండి ప్రజాక్షేత్రంలోకి వచ్చిన నేను మిమ్మల్ని చూసి గర్వపడుతున్నాని తెదేపా అధినేత నారా చంద్రబాబు తెలిపారు. యువతను ఎప్పుడు చూసినా నాకు ఉత్సాహం వస్తుంది నేను ఆధారపడింది యువశక్తి పైనే అని అన్నారు. ఎక్కడైతే యువత సమర్థవంతంగా ఉంటుందో అక్కడ విజయం ఉంటుందన్నారు.

ఏ వ్యక్తి అయినా పుట్టుకతో చిన్న వ్యక్తిగానే పుడతాడని మహాత్మగాంధీ, అంబేద్కర్, ఎన్టీఆర్ సామాన్య కుటుంబంలో పుట్టిన వారే అన్నారు. నేను కూడా చిన్న రైతు కుటుంబంలో పుట్టానన్నారు. నా చిన్నతనంలో లాంతర్లు పెట్టి చదువుకున్నా ఉక్కు కండరాలు ఉండే యువతను నాకు ఇవ్వండి ప్రపంచాన్ని మారుస్తానని స్వామి వివేకానంద అన్నారు. ఆయన అన్న దాన్ని నేను నిరూపించా బాగా చదివిస్తే యువత ప్రపంచాన్నే జయిస్తారని తెలిపారు.

వందల ఎకరాలు, డబ్బులు ఇచ్చినా తెలివిలేని వాడు అయితే పోగొట్టుకుంటాడని తెలిపారు. అదేవిధంగా నాడు ఎలక్ట్రానిక్ ఎక్స్ఛేంజ్ పెడతానంటే ఎగతాళి చేశారు కానీ నేను చేసి చూపించాన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు లేవు, ఉద్యోగాలు లేవు. యువత నిరాశతో ఇతర రాష్ట్రాలు, దేశాలకు వెళ్తున్నారు. రాష్ట్రంలో ఎలాంటి అవకాశాలు లేవు మీ జీవితాలను చీకటి మయంచేసిన జలగను ఇంటికి పంపాలన్నారు. మోసం చేయడంలో జగన్ దిట్ట అని జాబ్ కేలండర్ ఇస్తానన్నాడు ఐదేళ్లు అయింది ఒక్క జాబ్ కేలండర్ అయినా వచ్చిందా అని ప్రశ్నించారు.

యేటా డీఎస్సీ అన్నాడు పెట్టాడా పోతూ పోతూ డీఎస్సీ అన్నాడు. జగన్ వేలకోట్లు సంపాదించాలి ఆయన పక్కనున్న దొంగలు వందల కోట్లు సంపాదించాలి పరిపాలన చేశారని చంద్రబాబు తెలిపారు. కానీ యువతకు మాత్రం ఐదు వేలు జీతం ఇచ్చే ఉద్యోగం కావాలి మొన్నొక మంత్రిని చూశా హోటల్ సప్లై చేస్తూ యువతను కూడా అలాగే చేస్తానని చెప్పాడు. సరసమైన ధరలకే జగన్ గంజాయి వదిలాడు ఎక్కడ బట్టినా గంజాయి దొరుకుతుంది? జే బ్రాండ్స్ తీసుకొచ్చాడు బ్రెజిల్ నుండి 25 వేల కేజీల డ్రగ్స్ విశాఖ పోర్టు కు తీసుకొచ్చారని తెలిపారు.

మన రాష్ట్రంలోని యువతంతా ఆలోచించాలని మీ భవిష్యత్తుకు భరోసా ఇచ్చే బాధ్యత నాది అన్నారు. వైసీపీని చిత్తుగా ఓడించి ప్రజలకు వాస్తవాలు చెప్పాలన్నారు. 2018లో గ్రూప్1కు నోటిఫికేషన్ ఇచ్చాను.. కానీ ఈ ప్రభుత్వం వచ్చాక విధానాలను మార్చి డిజిటల్ మూల్యాంకనం చేపట్టారు. నిరుద్యోగులు పోరాడారు. న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో మాన్యువల్ గా చేయాలని చెప్పింది. కానీ వీళ్ల మనుషులకు ఉద్యోగాలు ఇవ్వాలని మాన్యువల్ మూల్యాంకనం చేశారని కోర్టుకు తప్పుడు సమాచారం ఇవ్వడంతో కోర్టు వాతలు పెట్టింది.

ఎన్నో ఏళ్లు చదివి మీారు ముందుకు వెళ్తే ఈ ప్రభుత్వం పోస్టులు అమ్ముకుంది జగనే అన్నారు. జగన్ ను హెచ్చరిస్తున్నా యువతను భవిష్యత్తును నాశనం చేసిన వారిని వదిలే ప్రసక్తే లేదన్నారు. ఏపీ గతంలో పెట్టుబడులకు చిరునామా ప్రపంచమంతా నాడు తిరిగి రూ.16 లక్షల కోట్లు పెట్టుబడులు తెచ్చాను అని తెలిపారు. అనంత పురం జిల్లాకు కియా మోటార్స్ తెచ్చా మనదగ్గర తయారైన కార్లు ప్రపంచమంతా తిరుగుతు న్నాయన్నారు. వీళ్లు వచ్చాక జాకీ పరిశ్రమ వాటా అడిగి తరిమేశారు. అమర్ రాజా పరిశ్రమను కూడా వేధించి తెలంగాణకు తరిమేశారు.

ఈ రాష్ట్రంలో పుట్టిన వ్యక్తులను కూడా పెట్టుబడులు పెట్టనీయడం లేదు. ఐదేళ్లలో రాష్ట్రానికి రూపాయి పెట్టుబడి వచ్చిందా, ఒక్క ఉద్యోగం అయినా వచ్చిందా అని ప్రశ్నించారు. కియాకు 650 ఎకరాలు ఇచ్చి వేల ఉద్యోగాలు తెచ్చాం కియా కార్లు 12 లక్షలు రోడ్లు మీద తిరుగుతున్నాయి. కానీ 8 వేల ఎకరాలు లేపాక్షి భూములను నాలెడ్జ్ హబ్ కు తీసుకున్నారు. కానీ వాటిపై ఇప్పుడు జగన్ కన్ను బడింది. 10 వేల కోట్లు విలువ చేసే భూములను రూ.500 కోట్లకు కొట్టేయాలని చూశారని తెలిపారు.

భూములు కేటాయించి ఉద్యోగాలు నేను ఇస్తే స్కాములపైనే స్కాములు చేసిన వ్యక్తి జగన్, కుప్పం గ్రానైట్ ఎంతో పేరుగాంచింది 5 ఏళ్లుగా వైసీపీ నేతలు దోచుకుంటున్నారని తెలిపారు. కేజీఎఫ్ తరహాలు గ్రానైట్ తవ్వి అమ్మేసు కుంటున్నారు. ఇక్కడే ఇలా జరిగితే ఇక రాష్ట్రంలో పరిస్థితి ఏంటి అని ప్రశ్నించారు. గనులు, ఇసుక, బెరైటీస్ లాంటి ఖనిజ సంపదనంతా దోచేశారు. ప్రజల ఆస్తి ప్రజలకే అందాలన్నారు. టెక్నాలజీ దుర్మార్గుల చేతుల్లోకి వెళితే అరిష్టం. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తెచ్చారు. జగన్ ఇంట్లో కూర్చుని ఏమేమి రికార్డులు మార్చాలో వివరాలన్నీ రాసుకున్నారు.

వైసీపీ మళ్లీ వస్తే మీ ఇంటి మీద కూడా మీకు హక్కులుండవు అన్నారు. వైసీపీని యువత భూస్థాపితం చేయాలి నా మీద కేసుల మీద కేసులు పెట్టారు, నా జీవితంలో భయం అనేది ఎరగలేదు. గాడి తప్పిన పాలనను మళ్లీ గాడిలో పెడతానాని అన్నారు.కేంద్రం సాయం లేకపోతే రాష్ట్ర ముందుకు సాగడం కష్టం అవుతుంది. రైతుల ఆత్మహత్యలు పెరిగాయన్నారు. అమరావతిని నాశనం చేశారు మహిళలపై దారుణాలు పెరిగాయి వీటన్నింటినీ సరి చేయడానికే ఎన్డీయేలో చేరాం అని తెలిపారు. సీట్లు కోసం కాదు రాష్ట్రాన్ని కాపాడటానికి బాధ్యతగా కలిసి ముందుకు వస్తున్నాం. జండాలు మూడు కానీ మా అజెండా ఒక్కటే అది ఏపీని కాపాడుకోవడమే. ప్రజలు గెలవాలన్నారు. రాష్ట్రం నిలవాలి అప్పుడే యువత భవిష్యత్తుగా బంగారం అవుతుందన్నారు.

అధికారంలోకి వచ్చాక యువగళం ద్వారా 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం. ఉద్యోగం వచ్చేదాకా రూ.3 వేల భృతి ఇస్తామన్నారు. కుప్పంను బెంగళూరు, కోలార్, కృష్ణగిరితో అనుసంధానం చేస్తాం. ఏ రైలువచ్చినా కుప్పంలో ఆగేలా చేస్తాం. విమాశ్రయాన్ని కూడా నిర్మిస్తాం అని తెలిపారు. ఇక్కడి నుండే వ్యవసాయ ఉత్పత్తులు విదేశాలకు పంపవచ్చు. పాడి పరిశ్రమను ఇంకా అభివృద్ధి చేస్తాం. 20 అంశాలతో కుప్పం అభివృద్ధికి విజన్ రూపొందిస్తా అని అన్నారు.

వైసీపీ నమ్ముకుంది రౌడీ ఇజాన్నే.. వాలంటీర్లకు మనం వ్యతిరేకం కాదన్నారు. ఇంజనీరింగ్ చేసినవాళ్ల కూడా వాలంటీర్లుగా చేస్తున్నారు. వైసీపీ నేతలు చేయించే తప్పుడు పనులతో వాలంటీర్లు జైలుకు వెళ్లొద్దు. వాలంటీర్లు కూడా సమాజంలో భాగమే వారిని కొనసాగించి మెరుగైన జీవితాన్ని అందిస్తాం అని తెలిపారు. ఉద్యోగులకు జీతాలు ప్రజలు కట్టే పన్నులు నుండే వస్తాయి రాజకీయ జోక్యం ఉద్యోగులు చేసుకో కూడదన్నారు. కరుడుగట్టిన వైసీపీ కార్యకర్తలు కూడా జగన్ కు ఓటేయరు.

2004లో కొత్తవాడు వస్తే ఇంకా బాగు చేస్తాడని అనుకుని ఓటేశారు కానీ ఏం జరిగింది మళ్లీ 2019లో దుర్మార్గుడు వచ్చి ఒక్క ఛాన్స్ అనడంతో ఐస్ అయ్యారని తెలిపారు. నిజస్వరూపం చూపించి దాడులు, పిడిగుద్దులు గుద్దాడు. డ్రామాల్లో జగన్ నెంబర్ వన్ హంద్రీనీవా నీళ్లు అంటూ సినిమా సెట్టింగ్ వేసి గేటు బెట్టి బురద చేశారు. జగన్ వెళ్లిపోయాక గేటు పీకేశాడు. బురద ఆరిపోయింది. ఇంకో నాటకంతో మళ్లీ కొత్త బిక్షగాడు మళ్లీ వస్తాడు. వాళ్లు చేసిన అన్యాయాలు చూసి చిత్తుగా ఓడించాలి.

ఎన్డీయే ప్రభుత్వం రాగానే 60 రోజుల్లోనే మెగా డీఎస్సీ ఫైలుపై సంతకం పెడతామన్నారు. ఇప్పుడు వదిలిన డీఎస్సీని కొనసాగిస్తే ఈ దుర్మార్గులు మళ్లీ మ్యానేజే చేసి వారికి అనుకూలమైన వారని నియమంచుకునే ప్రమాదం ఉంటుందన్నారు. ఎన్నికల కమిషన్ కూడా దీనిపై నిర్ణయం తీసుకోవాలన్నారు. ద్రవిడ యూనివర్సిటీని ప్రక్షాళన చేసి అన్ని కోర్సులను ప్రవేశపెడతాం. కుప్పంను నాలెడ్జ్ హబ్ గా తయారు చేస్తానాని హామీ ఇచ్చారు.

# అట్టడుగు వర్గాల పార్టీ అభ్యున్నతే బీసీవై పార్టీ లక్ష్యం

## - బీసీవై పార్టీ సంగారెడ్డి జిల్లా ఇన్చార్జ్ కోవూరి సత్యనారాయణ గౌడ్



హైదరాబాద్ మార్చ్ 26 (ఎక్స్ ప్రెస్ న్యూ స్)ల;: తెలంగాణ ఉద్యమాల గడ్డ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలంగాణ బీసీవై పార్టీ కీలక సమావేశంలో జరిగింది. తెలంగాణ బీసీవై పార్టీ ఎమ్మెల్యేలుగా పోటీ చేసిన అభ్యర్థుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొన్న బీసీవై పార్టీ సంగారెడ్డి జిల్లా ఇన్చార్జ్ న్యాయవాది కోవూరి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ బీసీవై పార్టీ అట్టడుగు వర్గాల పార్టీ , ధనిక, పేద అనే భావం లేకుండా అందర్నీ సమానత్వంతో చూసే ఏకైక రాజకీయ పార్టీ బిసివై పార్టీ అని కొనియాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజల అభివృద్ధి కోసం, తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అవినీతిని అంతం చేసేందుకు గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి గల్లీలో, వాడ వాడలో, రాష్ట్రంలోని 49 స్థానాల్లో గొంతు విప్పి ప్రచారం చేసిన పార్టీ బీసీవై పార్టీ అని తెలుపుతూ , తెలంగాణ ఉద్యమాల గడ్డ ఉస్మానియా యూనివర్సిటీ సాక్షిగా తెలంగాణ ప్రజల మనోభావాలను, పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని, తెలంగాణ రాష్ట్రాన్ని ,తెలంగాణ ప్రజల అభివృద్ధి కొరకు నిరంతరం పోరాడుతుందని ప్రజల పక్షాన ఉంటూ ప్రశ్నిస్తుందని, ప్రజా సమస్యలను తీరుస్తుందని, మీడియా మిత్రుల సమక్షంలో తెలియజేశారు.

తదన అనంతరం సమావేశంలో భాగంగా మునుగోడు నియోజకవర్గం ఇంచార్జ్ శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ బీసీవై పార్టీ అనుక్షణం, ప్రతిక్షణం నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలను దృష్టిలో ఉంచుకొని పార్టీ సిద్ధాంతాల ప్రకారం ప్రజల కొరకు ప్రజల పక్షాన ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరిస్తామని తెలియజేశారు.

ఈ యొక్క సమావేశంలో కోరుట్ల నియోజకవర్గం ఇంచార్జ్ న్యాయవాది సాయి కృష్ణ యాదవ్, హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ బాపు తిరుపతి, గోష్మహల్ ఇంచార్జ్ మేకల వివేక్ యాదవ్, ఎల్లారెడ్డి ఇంచార్జ్ పెద్ద గొల్ల జయకుమార్, తదితర నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేసిన బీసీవై పార్టీ ప్రముఖ నాయకులు పాల్గొన్నారు.

# ఈటల సమక్షంలో బీజేపీలో చేరిన మల్లంపేట్ బీఆర్ఎస్ కౌన్సిలర్



హైదరాబాద్, మార్చి 26:కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని మల్లంపేట 21వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ ఎంబరి లక్ష్మి ఆంజనేయులు ఇవాళ మల్లంపేట్ లోని ఎస్ఎంఎన్ఆర్ గార్డెన్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మల్కాజ్గిరి బీజేపీ పార్లమెంటు అభ్యర్థి ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నేత కూన శ్రీశైలం గౌడ్ ల సమక్షంలో బీజేపీ పార్టీలో చేరారు. మల్లంపేట్ 21వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ ఎంబరి లక్ష్మి ? ఆంజనేయులుతో పాటు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గుండిగూడెం గణేష్, గాండ్ల బాలరాజు, కొండా శ్రీకాంత్ లతో పాటు సుమారు 200 మంది బీజేపీలో చేరగా, వారికి ఈటల రాజేందర్, కూన శ్రీశైలం గౌడ్ లు కమలం కండువా కప్పి పార్టీలోకి స్వాగతించారు.

మల్కాజ్ గిరి పార్లమెంట్ లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు డా.ఎస్ మల్లారెడ్డి, కౌన్సిలర్ రాము గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి విగ్నేశ్వర్, కౌన్సిలర్ రాజిరెడ్డి, మల్లేష్ యాదవ్, గోనె మల్లారెడ్డి, అతిష్ బాబు, నర్సింగ రావ్, శ్రీనివాస్ గౌడ్, మురళి, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

# జనసేన పార్టీకి పవన్ కల్యాణ్ రూ.10 కోట్ల విరాళం

అమరావతి, మార్చి 26:జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పార్టీకి రూ. 10 కోట్ల విరాళాన్ని అందజేశారు. పార్టీ నిర్వహణ అవసరాలకు గాను జనసేన కోశాధికారి ఎ.వి రత్నంకు చెక్కును మంగళవారం అందజేశారు. పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో అనేక మంది నాయకులు, ప్రజలు తాము కష్టార్జితంగా సంపాదించిన వాటిలో కొంత భాగం ఉద్యమ నిర్వహణకు నిధులు ఇచ్చారని తెలిపారు.

అదే స్ఫూర్తితో తాను సినిమా పరిశ్రమ ద్వారా సంపాదించిన దాంట్లో నుంచి ఎప్పటికప్పుడు పార్టీకి తన వంతుగా నిధులిస్తూనే ఉంటానని పేర్కొన్నారు. దీంట్లో భాగంగా రూ.10 కోట్లను పార్టీ నిర్వహణ, కార్యకలా పాలకు అందించానని వెల్లడించారు. ఎన్నికల నిర్వహణ, పార్టీని నడపడం డబ్బుతో కూడుకుందని తెలిపారు. జనసేన పార్టీ పేదల నుంచి పెద్దల వరకు పార్టీ ఫండ్ కింద నిధులను పంపిస్తున్న వారికి కృతజ్ఞతలు తెలిపారు.

